

ప్రైవేటు హాస్టళ్లకు దీటుగా ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్స్

- ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులకు సైతం హాస్టల్స్‌లో వసతి
- సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ

ఖమ్మం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రైవేటు హాస్టళ్లకు దీటుగా ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్స్ ఉన్నాయని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులకు సైతం ఈ హాస్టల్స్‌లో వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రశ్న: జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎన్ని హాస్టల్స్ ఉన్నాయి. ఎంతమంది పిల్లలు చదువుతున్నారు?

జవాబు: జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మొత్తం 52 హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో హైస్కూల్స్‌కు విద్యార్థులకు 41, కాలేజీ విద్యార్థులకు 11 నిర్వహిస్తున్నాం. ఈ హాస్టల్స్‌లో 4,200 మంది విద్యార్థులు ఉంటున్నారు.

ప్ర: హాస్టల్స్‌లో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?

జ: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించాం. ప్రైవేటు హాస్టల్స్‌కు దీటుగా ఎస్సీ వెల్ఫేర్, ప్రభుత్వ హాస్టల్స్ జిల్లాలో ఉన్నాయి. విద్యార్థులకు ప్యూరిఫైడ్ వాటర్‌తోపాటు గీజర్, బెడ్లు, స్టడీ గదులు, డార్మెటరీ హాల్స్ కల్పించాం. ప్రతి విద్యార్థికి దుస్తులు, షూలు, నోటు పుస్తకాలు, బెడ్లు, దుప్పట్లు, రగ్గులు అందించాం. అలాగే స్టడీ మెటీరియల్ కూడా ఇస్తున్నాం. కొత్తగా హాస్టల్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ (మిగతా 6వ పేజీలో)

అంతర్జాతీయ స్థాయి విద్యతో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా' (పీఎంశ్రీ) పథకంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాద్రి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారిపోతున్నాయి. గతంలో ఎంపిక చేసిన పాఠశాలలకు ఏడాది కాలంగా పలు రకాల గ్రాంట్లు, అధునాతన ల్యాబ్‌లు సమకూరాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద, మధ్య తరగతి విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంచేందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు పీఎంశ్రీ ద్వారా సమకూరుతున్నాయి. దీంతో సర్కారీ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లను తలపిస్తున్నాయి.



కంప్యూటర్ ల్యాబ్



సైన్స్ ల్యాబ్

సర్కారీ స్కూళ్లు.. సరికొత్తగా

కార్పొరేట్ స్కూళ్లను తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు

- అందుబాటులోకి సైన్స్, ఏటీఎల్, అగ్రికల్చరల్, కంప్యూటర్ ల్యాబ్‌లు
- పలు పాఠశాలలకు సంగీత పరికరాల అందజేత
- 'పీఎంశ్రీ'తో ఖమ్మం జిల్లాలో 28, భద్రాద్రి జిల్లాలో 24 పాఠశాలలకు మహర్దశ

భద్రాచలం/ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి 28 పాఠశాలలు ఎంపికయ్యాయి. భద్రాద్రి జిల్లాలో 2023-24లో 20 పాఠశాలలు ఎంపికవ్వగా మలివిడతలో మరో నాలుగు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలలకు విడతల వారీగా కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎంశ్రీ నుంచి నేరుగా కంప్యూటర్లు, డిజిటల్ రూం, అగ్రికల్చరల్ ల్యాబ్‌లు సమకూరాయి. ఇదే సమయంలో ఏటీఎల్ (అటల్ థింకింగ్ లాబ్) సైతం సమకూరడంతో ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించే దిశగా పూర్తిస్థాయిలో అడుగులేస్తున్నాయి. జిల్లాలో తాజాగా నాలుగు పాఠశాలలకు సంగీత పరికరాలు అందాయి.

ఖమ్మం జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి మొత్తం 28 పాఠశాలలు ఎంపికైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇందులో మొదటి దశలో 22, రెండో దశలో 6 పాఠశాలలు ఎంపికైనట్టు తెలిపారు. ఇందులో 26 పాఠశాలల్లో సంగీత పాఠాలు చెప్పనున్నారు. రెండో దశ ఎంపికైన పాఠశాలలో నూతనంగా సంగీత పాఠాలు నేర్పిచటం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 6 పాఠశాలలకు సంగీత పరికరాలు విడతల వారీగా వస్తున్నట్లు తెలిసింది. మొదటి దశ 22 పాఠశాలలు ఎంపిక కాగా, రెండో దశలో ఎంపికైన ఆరు పాఠశాలలు జిల్లాలోని పెనుబల్లి మండలంలోని అడివిమల్లెల టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ పాఠశాల, వైరా టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ పాఠశాల, ఎర్రుపాలెం టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ పాఠశాల, కామేపల్లి మండలం కొమ్మినేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలు ఎంపికకాగా, మిగిలిన రెండు ఒకటి బోనకల్ మండలం సిరిపురం, రెండోది సత్తుపల్లి ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతానికి సంగీతానికి సంబంధించిన పాఠాలు ఏ పాఠశాలలోనూ అందుబాటులోకి రాలేదని ప్రత్యేక ఉపాధ్యాయుడిని నియమించిన అనంతరమే పాఠాలు మొదలవుతాయని తెలిపారు. గతేడాది జిల్లాలో 267 పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా వాటిలో కేంద్ర ప్రభుత్వం మండలానికి రెండు చొప్పున గుర్తించి మొత్తం 42 పాఠశాలలను జిల్లా విద్యాశాఖ ఎంపిక చేయనుంది. 5 సంవత్సరాల్లో ఒక్కో పాఠశాలకు రూ.2కోట్లు విడతల వారీగా అందనున్నాయి.

మారిన రూపు రేఖలు..

గతంలో పాఠశాలల్లో విద్యార్థులకు ఏదైనా అధునాతన పద్ధతుల్లో బోధించాలంటే ఎన్నో సమస్యలుండేవి. అలాగే కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగా డిజిటల్ రూంలలో బోధన ఉండేది కాదు. ఒక వైపు ఆధునిక విద్యను (మిగతా 6వ పేజీలో)



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఆ నాలుగు పంచాయతీలను తెలంగాణలో కలపండి

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ఖమ్మం, జూన్ 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి సరిహద్దున ఏపీలో విలీనమైన నాలుగు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందించారు. భద్రాచలం పుణ్యక్షేత్ర భూములన్నీ ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్నాయని, పరిపాలనాపరంగా ఇబ్బందులు వస్తున్నాయని, పురుషోత్తపట్నం, యటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలతో పాటు 17 రెవెన్యూ గ్రామాలను తెలంగాణలో కలపాలని సూచించారు. తద్వారా భద్రాచలం ప్రాంత అభివృద్ధితో పాటు గిరిజన ప్రాంత అభివృద్ధికి ఉపయోగం ఉంటుందని, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు సమగ్రత నెలకొంటుందన్నారు. ఈ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాలను తెలంగాణలో కలిపేందుకు కేంద్ర ప్రభుత్వం కృషిచేయాలన్నారు. భౌగోళికంగా భద్రాచలంతో కలిసి ఉన్న ఈ గ్రామాలు ఆంధ్రాలో ఉండడంతో పరిపాలనా పరంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. పునర్విభజన చట్టంలోని ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆ ప్రాంతం నుంచి మంత్రిగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్నందున ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పురుషోత్తపట్నంలో ఉన్నాయని, పరిపాలనా పరంగా ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. పురుషోత్తపట్నం, యటపాక, పిచుకులపాడు, కన్నాయిగూడెం తదితర పంచాయతీల గ్రామాల గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని సూచించారు. రాకపోకలకు చెక్‌పోస్టు సమస్యలు వస్తున్నాయని, ఈ నాలుగు పంచాయతీలు ఏపీ పరిపాలనకు చివరన ఉన్నాయన్నారు. అలాగే వ్యవసాయశాఖ పరంగా రాష్ట్రంలోని పలు సమస్యలను కేంద్రమంత్రికి తుమ్మల వినతిపత్రాల ద్వారా అందించారు. జాతీయ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పసుపు బోర్డు ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

రేపటి నుంచి ఎప్‌సెట్ కౌన్సిలింగ్

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎప్‌సెట్ 2025)లో అర్హత సాధించిన విద్యార్థులకు జూలై 1 నుంచి 8 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకున్న అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో సమయం పాటిస్తూ సకాలంలో హాజరుకావాలని తెలిపారు. కౌన్సిలింగ్‌కు వెంట తెచ్చుకోవాల్సిన సర్టిఫికెట్లు 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమో, ఇంటర్మీడియట్ టీసీ, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు (కులం సర్టిఫికెట్ 2025 జనవరి 1 నుంచి ఉండాలి), ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ 2025 (ఎకనమికల్లీ వీకర్ సెక్షన్‌కు మాత్రమే), స్లాట్ బుకింగ్ ఫాం, ఎప్‌సెట్ ర్యాంకు కార్డు, ఎప్‌సెట్ హాల్‌టికెట్, మొత్తం సర్టిఫికెట్లు రెండు జతల జిరాక్సులు వెంట తీసుకురావాలని తెలిపారు.



తగ్గుతున్న 'పాలేరు' నీటిమట్టం

కూసుమంచి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం నీటిమట్టం గణనీయంగా తగ్గింది. వేసవిలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే గత మార్చిలో 18 అడుగుల వరకు నిల్వ ఉంచారు. కానీ వేసవిలో నీరు ఆవిరవడం, మూడు జిల్లాలకు తాగునీటికి వాడటంతో నీటిమట్టం తగ్గిపోయింది. 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి ప్రస్తుతం 12 అడుగులకు తగ్గిపోయింది. ప్రస్తుతం ఉన్న నీరు మరో 15, 20 రోజుల వరకు సరిపోతుందని మిషన్ భగీరథ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ మొదటి జోన్ పరిధిలో ఎగువన మరమ్మతులు జరుగుతున్నందున సాగర్ డ్యాం నుంచి నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఈలోగా వర్షాలు పడితే కొంత ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

మోదీ మెచ్చిన మిల్లెట్ బిస్కెట్లు

- 'మన్‌కీబాత్'లో భద్రాద్రి గిరిజన మహిళల విజయాన్ని ప్రశంసించిన ప్రధాని
- అభినందించిన కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఏఎస్పీ
- బిస్కెట్ల తయారీకి అవసరమైన యంత్రాలు అందజేస్తాం: ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలోని గిరిజన మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా బలపడేందుకు భద్రాద్రి మిల్లెట్స్ మ్యాజిక్ ద్వారా బిస్కెట్ల తయారీ చేస్తూ విక్రయిస్తున్న తీరును ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. మన్‌కీబాత్ 123వ భాగంలో



మిల్లెట్ బిస్కెట్లతో మహిళలు

ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని భద్రాచలం మహిళల విజయం గురించి తెలుసుకుంటే మీరు ఎంతో సంతోషిస్తారని, ఈ మహిళలు గతంలో పొలాల్లో కూలీలుగా పని చేసేవారని, నేడు రాగి, జొన్న, కొర్రలు, సామలతో బిస్కెట్లను తయారు చేసి విక్రయిస్తున్నారన్నారు. ఈ బిస్కెట్లు భద్రాచలం నుంచి హైదరాబాద్, ఢిల్లీ, లండన్ దాక వెళ్లడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. భద్రాచలం మహిళలు స్వయం సహాయక బృందాలతో అనుసంధానమై శిక్షణ పొందడం ద్వారా ఇది సాధ్యమైందని ప్రధాని మోదీ తెలిపారు. అదేవిధంగా ఈ మహిళలు మరో ప్రశంసనీయమైన పని సైతం చేస్తున్నారని, గిరి శానిటరీ ప్యాడ్స్ కేవలం మూడు నెలల్లో 40 వేలు తయారు చేసి పాఠశాలలు, వసతి గృహాల్లోని బాలికలకు సరఫరా చేశారన్నారు.

గతంలో పరిశీలించిన ట్రైఫెడ్ అధికారులు

భద్రాచలంలో మిల్లెట్ బిస్కెట్లను తయారు చేస్తున్న తీరును భద్రాచలం ఐటీడీఏ సందర్శన సమయంలో ట్రైబల్ కోపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ట్రైఫెడ్) అధికారుల బృందం పరిశీలించింది. స్వయంగా బిస్కెట్లను తిన్న అధికారులు వాటి రుచి బాగుండటంతో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మార్చి మొదటి వారంలో ఏర్పాటు చేసే స్టాల్స్‌లో మిల్లెట్ బిస్కెట్లు, రాగి, జొన్న, కొర్రలు, సామలు బిస్కెట్లను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. దీంతో భద్రాచలం ఐటీడీఏ తరఫున వెళ్లిన శ్రీరామ జాయింట్ లయోబిలిటీ గ్రూప్‌నకు చెందిన మహిళలు అక్కడ వాటిని స్టాల్స్‌లో ఏర్పాటు చేయడంతో అందరూ ఆ రుచికి ఫిదా అయ్యారు. ఈ క్రమంలోనే ప్రధాని



భద్రాద్రి మిల్లెట్ బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్

నరేంద్రమోదీ దృష్టికి సైతం ఈ బిస్కెట్ల గురించి ట్రైఫెడ్ అధికారులు తెచ్చినట్లు తెలుస్తోంది.

అభినందించిన కలెక్టర్, పీవో, ఏఎస్పీ

భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ తయారీ కేంద్రాన్ని ఆదివారం సందర్శించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఐటీడీఏ పీవో బి.రాహుల్‌లు గిరిజన మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా వారికి ఐటీడీఏ తరఫున మిల్లెట్స్ తయారీకి కావాల్సిన అధునాతన సామగ్రిని ఐటీడీఏ తరఫున ఉచితంగా అందిస్తామని పీవో రాహుల్ తెలిపారు. ఇదిలా ఉండగా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పీవో రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్‌లకు మిల్లెట్ బిస్కెట్లను, సున్నుండలను మహిళలు అందించారు.

త్యాగాల పార్టీ సీపీఐ

- అత్యంత ప్రమాదకరమైన పార్టీ బీజేపీ
- జైళ్లలో ఉండాల్సిన వాళ్లు చట్టసభల్లో ఉంటున్నారు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

నేలకొండపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అనేక త్యాగాలతో పునీతమై, ప్రజల సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రజల్లో ఉంటున్న పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నేలకొండపల్లి మండలం, ముటాపురంలోని బీకేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన మండల సీపీఐ 17వ మహాసభలో కూనంనేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో కూనంనేని మాట్లాడుతూ మతం పేరుతో ఓట్లు సంపాదించుకునే వారికి నిజంగా మతంపై ప్రేమ లేదన్నారు. దేశంలో ప్రమాదకరమైన పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. దొంగ స్వాములను పెంచి పోషించేది, పూజల పేరుతో మహిళలను మోసగించేది బీజేపీ అన్నారు. ప్రజల కోసం పోరాడే కమ్యూనిస్టులు, నక్సలైట్లు జైళ్లలో మగ్గుతుంటే, జైళ్లలో ఉండాల్సిన దొంగలు మాత్రం చట్ట సభల్లో ఉంటున్నారన్నారు. పేదల కోసం (మిగతా 6వ పేజీలో)

ఆశల సాగులో..
పామాయిల్ వైపు
- ప్రభుత్వ చేయూత, మంత్రి తుమ్మల ప్రోత్సాహంతో రైతుల ముందడుగు
- దారుగాబంజరలో ఒకే రోజున పది ఎకరాల్లో సాగు షురూ
- ఓ యువ రైతు బాటలో మరి కొందరు

7

సోషల్ మేనియా..
- గ్లోబల్ కమ్యూనికేషన్ వ్యవస్థగా మారిన సోషల్ మీడియా
- ఫేస్‌బుక్ నుంచి మొదలై అనేక మాధ్యమాలు
- సమాజాన్ని ప్రభావితం చేస్తున్న ఆన్‌లైన్ యాప్స్
- నేడు ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం





కంచె వేస్తున్న సిబ్బంది

సెంటీమీటర్ కూడా ప్రభుత్వ స్థలం కబ్జా కావొద్దు

- ఖమ్మంలో స్థలాల గుర్తింపు, కంచె, బోర్డుల ఏర్పాటు
- ముందు చూపుతో ఆదేశాలిచ్చిన మంత్రి తుమ్మల

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాబోయే 50ఏళ్లను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలు రూపొందిస్తుంటారు. ఉమ్మడి తెలుగురాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఖమ్మం నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు ఇలా అనేక రంగాల్లో తనకంటూ ప్రత్యేకతను చాటుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్మాణాల కోసం ప్రభుత్వ భూములు అవసరం ఉంటుందని ఖమ్మం నగరంలోని సెంటీ మీటర్ ప్రభుత్వ భూమిని కూడా కబ్జా కావ్దోని ఇటీవల రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెవెన్యూ, ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులకు ఆదేశించారు. దీంతో వారం రోజులుగా రంగంలోకి దిగిన అధికారులు ప్రత్యేకంగా సర్వేలు చేపట్టారు. నగరంలో ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ భూములకు హద్దులను, కంచెలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల బోర్డులను నిర్మాణం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలో రాజకీయాలకు అతీతంగా అధికారులు ముందుకు వెళ్తున్నారు. కొన్ని వత్తిడులు వస్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో ముందుకు వెళ్తున్నారు.

సర్కార్ చదువుకే మొగ్గు

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థులు
- ఫలించిన జయశంకర్ బడిబాట
- ప్రభావం చూపుతున్న నూతన ఉపాధ్యాయుల నియామకం

ఎర్రుపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్ట చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమం ఎర్రుపాలెం మండలంలో ఈఏడాది మంచి విజయాలను సాధించింది. ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం, గత విద్యాసంవత్సరంలో మెరుగైన పదో తరగతి ఫలితాలు, ఉత్తీర్ణత శాతం ఇందుకు కారణమని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది భారీగా విద్యార్థులు తరలివస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది డీఎస్సీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేసింది. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు కూడా ఈ పెరుగుదలకు దోహదపడ్డారు. జూలై, ఆగస్టు నెలల్లో మరిన్ని అడ్మిషన్లు వస్తాయని భావిస్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు

గత పదేళ్లలో తెలంగాణలో ఉపాధ్యాయులు లేక తరగతి గది అభ్యసనం సంక్షోభం ఎదుర్కొంది. విద్యాపాలనకు అధికారులు లేక, పర్యవేక్షకులు లేక బోధన సంక్షోభంతో పాఠశాల విద్య చిన్నాభిన్నమైంది. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల విశ్వాసం పొందలేక వెలవెలపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు సదభిప్రాయం లేదు. సర్కారు బడి అంటేనే ఉపాధ్యాయులు పాఠశాలలకు సరిగా రారని, పాఠశాలల్లో అన్ని తరగతులకు సబ్జెక్టు లకు ఉపాధ్యాయు కొరత ఉంటుందని, పరీక్షల సమయంలో ప్రత్యేక శ్రద్ధ ఉండదనేది వారి బలమైన అభిప్రాయం. ఇది తల్లిదండ్రుల అనాసక్తికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఫీజులు భారమైనా ప్రైవేటు పాఠశాలలకే మొగ్గు చూపేవారు. అయితే ఈ విద్యాసంత్సరం వారి ఆలోచనలో మార్పు మొదలైంది. ఈఏడు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో విద్యార్థులు సాధిస్తున్న మార్కులతో పాటుగా ఉత్తీర్ణత శాతం పెరగడం, ప్రభుత్వ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి కారణంగా సర్కారు బడుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రైవేటు పాఠశాలల నుంచి సర్కారు బడులకు కొత్త అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుంది. జూలై, ఆగస్టు నెలల్లో ఇంకా విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.



జమలాపురంలో విద్యార్థులకు ట్యూషన్ ఏర్పాటు చేసిన దృశ్యం

ఫలించిన సర్కారు బడిబాట కార్యక్రమం

ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను ప్రత్యేకత ను వివరిస్తూ విద్యార్థుల నమోదు లక్ష్యంగా ప్రభుత్వం జూన్ 6 నుంచి 19 వరకు జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. నూతన విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడులను సకల సౌకర్యాలతో విద్యార్థుల భవితకు బాటలు వేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఎన్ని విధాలుగా ప్రయోజనం పొందవచ్చో వివరించింది. సర్కారు బడుల పట్ల తల్లిదండ్రులు ఆకర్షితులయ్యేలా విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గతానికి భిన్నంగా పోస్టర్లు ముద్రించి ప్రచారం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో చేరితే రూ.లక్షన్నర వరకు ఖర్చవుతుందని ఇప్పుడు ఆదా చేసి డబ్బును మీ పిల్లల ఉన్నత చదువులకు పొదుపు చేయాలని.. మీ డబ్బులు మీ దగ్గరే.. మీ పిల్లల భవిష్యత్ మా దగ్గర అంటూ ప్రచారం చేశారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్కారుబడుల ప్రతిష్టను పెంచేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కొందరు ఉపాధ్యాయులు ముందడుగువేసి ప్రత్యేక ట్యూషన్లు, రవాణసౌకర్యం లాంటి వ్యక్తిగత హామీలతో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను సైతం ప్రభుత్వ బడిబాట పట్టించారు. ఈ బడిబాటలో మండలంలో 52 ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీల నుంచి ప్రాథమిక విద్యకు 149మంది, ప్రాథమిక విద్య నుంచి 10వతరగతి వరకు 323మంది, మొత్తం 471 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. దీనిలో 169మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి సర్కారుబడులకు మారారు. దీనికి తోడు మండలంలో ప్రభుత్వం డీఎస్సీ 2024 ద్వారా సుమారు 70మంది నూతన ఉపాధ్యాయులను నియమించింది. ఖాళీగా ఉన్న టీచర్లు పోస్టులను భర్తీచేసింది.



వెంకటాపురంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

ఆదర్శంగా ప్రభుత్వ పాఠశాలలు

గతంలో ఉన్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను రద్దుచేసి వాటి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటుచేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమణాలు పెంచి నాణ్యమైన గుణాత్మక విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కమిటీలకు రూపకల్పన చేసింది. మండలంలో 35 పాఠశాలల్లో తాగునీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, తలుపులు, కిటికీల ఏర్పాటు, గదుల మరమ్మతులు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ వంటి మౌలిక వసతుల కోసం రూ.96,27,000లను కమిటీల ద్వారానే ఖర్చుచేసి ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీర్చిదిద్దింది. పాఠశాల హెచ్‌ఎంలు చైర్మన్‌గా స్వయం సహాయ సంఘాల ఆధ్వర్యంలో ఈ పనులు జరగడంతో ప్రభుత్వ పాఠశాలలకు పునర్వైభవం వస్తుందన్న నమ్మకం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఏర్పడింది. ముఖ్యంగా బాలికల చదువుకు ఆటంకం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో సర్కారు చదువుకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.

కుట్టు శిక్షణలో కొత్త డిజైన్లు నేర్చుకోవాలి

గిరిజన యువతకు పుణె, ముంబైకి చెందిన వారితో శిక్షణ ఇప్పిస్తాం: భద్రాద్రి కలెక్టర్

భద్రాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువతులు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారు మారుతున్న పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లు నేర్చుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలో ఆదివారం వైటీసీ ఆవరణలో గిరిజన యువతులు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఐటీడీఏ పీవో బి.రాహుల్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి యువతులకు వ్యాపారంలోని మెలకువలు, సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉండి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి హైదరాబాద్ పంపించి పుణె, ముంబై నుంచి వచ్చే ఫ్యాషన్ డిజైనర్లతో శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. అలాగే శ్రీరామనవమి, ముక్కోటి సమయాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసుకొని ప్రదర్శించడం, హైదరాబాద్ శిల్పారామంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో దుకాణాలను ఏర్పాటు చేసుకొని అంగన్‌వాడీలకు అనుబంధంగా పని చేయాలని కోరారు. కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలకు క్లస్టర్ వారీగా గ్రూపులు తయారు చేసి ఎంబ్రాయిడరీకి సంబంధించిన పెద్ద మిషన్ ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పీఎంఆర్‌సీ కార్యాలయం సందర్శించి కార్యాలయంలో గిరిజనులకు సంబంధించిన అన్ని రకాల సంక్షేమ పథకాల పెయింటింగ్ డిజైనింగ్ వేయించాలని అన్నారు. నిరుద్యోగ యువకులకు శిక్షణలు ఇప్పించే జాబితా, గిరిజనులకు అన్ని విధాల ఉపయోగపడే అన్ని జాబితాలు రూపొందించి ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో సున్నం రాంబాబు, ఈఈ హరీష్, ఏసీఎంవో రమేష్, టి.ఏ. శ్రీనివాస్, మేనేజరు ఆదినారాయణ, ఆర్‌ఐ నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

గోదావరికి కొత్తనీరు

- ఈ సీజన్‌లో ఇదే తొలిసారి
- వర్షాలతో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం

భద్రాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నదీ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఈ సీజన్‌లోనే తొలిసారి స్వల్పంగా పెరిగింది. 28న ఐదు అడుగులున్న గోదావరి నీటిమట్టం ఆదివారం రాత్రి 7 గంటలకు 8.5 అడుగులకు చేరుకుంది. ఇది 9.5 అడుగుల వరకు చేరుకోనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద ఇంతకాలం ఇసుక తిన్నెలతో దర్శనమిచ్చిన ప్రాంతం స్వల్ప నీటిమట్టం పెరుగుదలతో దర్శనమిస్తోంది.



సబ్ జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ జూన్ 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ జట్లను ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికల్లో భాగంగా అండర్-10, 12, 14 బాలురు, బాలికలకు పరుగు పోటీతో పాటు లాంగ్ జంప్, ట్రయథ్లాన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్ అహ్మద్ ప్రకటించారు. ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ సంఘ బాధ్యులు వెంకటేశ్వర్లు, సుధాకర్, రవి, క్రిష్ణయ్య, ముజాహిద్, హలీం, నవీద్, ప్రియాంక, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ తదితరులు సమీక్షించారు.



సబ్ జూనియర్స్ పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

సర్కారీ స్కూళ్లు.. సరికొత్తగా

(5వ పేజీ తరువాయి)

అందిస్తూనే మరో వైపు క్షేత్రస్థాయిలో వ్యవసాయం, కుట్లు అల్లికలపై తగిన శిక్షణ ఇవ్వనున్నారు. వీటన్నింటికీ పీఎంశ్రీ పథకమే ప్రధాన ఆధారంగా నిలిచింది. 2023-24లో పీఎంశ్రీ ప్రక్రియ ప్రారంభం కాగా తొలి విడతలో జిల్లాలో 20పాఠశాలలను ఎంపిక చేయగా, 2024-25లో మరో నాలుగు పాఠశాలలను ఎంపిక చేశారు. ఐదేళ్లపాటు ఈ పథకం కింద నిధులు విడుదలవుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవలి కాలంలో ఈ పథకంతో భద్రాచలంలోని పీఎంశ్రీ ఎస్‌ఎన్‌ఎం జిల్లాపరిషత్ హైస్కూల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. గతంలో మూడు డిజిటల్ రూంలు అందుబాటులో ఉండగా ఇటీవల తాజాగా మరో డిజిటల్ రూం అందుబాటులోకి వచ్చింది. సైన్స్ ల్యాబ్, అగ్రికల్చర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. అలాగే పది కంప్యూటర్లతో ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు.



పాఠాల బోధనకు ఆధునిక డిజిటల్ బోర్డు

ఆవిష్కర్తలుగా మార్చేందుకు..

అటల్ థింకింగ్‌ల్యాబ్(ఏటీఎల్) అనేది దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం)ని నీతి ఆయోగ్ ద్వారా విద్యార్థులను ఆవిష్కర్తలుగా మారడానికి నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి దోహదపడనుంది. విద్యార్థులు, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ ఆచరణాత్మక అభ్యసనవాతావరనాన్ని అందించేందుకు ఇది ఉపయోగపడనుంది.

జిల్లాలో మొదలైన సర్వే..

డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్ ప్లస్) కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వసతులు లేని పాఠశాలలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడానికి పాటుపడుతున్నారు. ఇందులోనూ ప్రస్తుత వసతుల ఆధారంగా జిల్లాస్థాయి కమిటీ ప్రతి మండలంలో రెండేసి పాఠశాలలను పీఎంశ్రీకి ఎంపిక చేయనుంది. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్ లింక్‌ను జిల్లా విద్యాశాఖ పాఠశాలల ప్రధానాచార్యులకు పంపించారు.

బడుల్లో కల్పించే సదుపాయాలు

ఐసీటీ (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ), స్మార్ట్ తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీలు, సైంటిఫిక్ లాబొరేటరీలు, వృత్తిపరమైన ప్రయోగశాలలు, ఆహ్లాదకరమైన వాతావరణం, ప్లాస్టిక్ రహితం, శుద్ధి జలం, నాణ్యమైన విద్య, అంతర్జాల సదుపాయం, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య కార్యక్రమాలలకు సంబంధించిన విషయాలను విద్యార్థులకు నేర్పనున్నారు.



నేలకొండపల్లి పాఠశాలకు చేరిన సంగీత పరికరాలు

త్యాగాల పార్టీ సీపీఐ

(5వ పేజీ తరువాయి)

నిలబడుతున్నందులకే ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను చంపుతున్నారని ఆక్షేపించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కూనంనేని డిమాండ్ చేసారు.

పొత్తులు శాశ్వతం కాదు

కమ్యూనిస్టుల పొత్తులు శాశ్వతం కాదని కూనంనేని తెలిపారు. మతోన్మాద బీజేపీని ఓడించేందులకు మాత్రమే బూర్జువా పార్టీలతో పొత్తులు పెట్టుకుంటున్నామన్నారు. మొన్న బీఆర్ఎస్, నిన్న కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలకు పార్టీ కార్యకర్తలు పోటీలో ఉండాలన్నారు. మన గౌరవానికి తగ్గట్లుగా కలిసి వస్తే తప్ప అన్ని స్థానాల్లో పోటీ చేయాల్సిందేనని కార్యకర్తలకు సూచించారు. ప్రస్తుతం సాయుధ పోరాటానికి పరిస్థితులు అనుకూలంగా లేనందున మావోయిస్టులు జనజీన ప్రవంతిలో కలవాలంటూ కూనంనేని పిలుపునిచ్చారు. రైతులు భూమిని సాగు చేయటానికి ఎంతలా కష్టపడతారో.. కమ్యూనిస్టులు పార్టీ కోసం అలా రైతులా కష్ట పడాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న ఖమ్మంలో 5లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభలో ప్పాట రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, కర్నాటి భానుప్రసాద్, కనకబండి సీతారాములు, బాగం నర్సింహారావు, ఫాల్తియా శ్రీనివాసరావు, మారిశెట్టి వెంకటేశ్వర్లు, నంబూరి నారాయణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

ఖమ్మం చర్చికాంపౌండ్, జూన్29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు మాని రిజర్వేషన్ల పెంపుకు నిబద్ధతతో కృషిచేయాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు తెస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 18నెలలుగా కాలయాపన చేస్తుందే తప్పా, అందుకు అవసరమైన జీవోను విడుదల చేయడం గాని రాజ్యాంగ సవరణకు ప్రయత్నం చేయడానికి పూనుకోకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల రిజర్వేషన్ పెంపుకోసం కనీసం ఒక్కసారి కూడా ప్రధానమంత్రిని కలవకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా వికారాబాద్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మంజిల్లాలో బీసీలకు ఒక్కస్థానం కూడా దక్కకపోవడం బీసీలపై కొనసాగుతున్న వివక్షతకు ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు.

గ్రామస్థాయిలో బీసీలు ఐక్యమైతే రాజ్యాధికారం నల్లేరుపై నడకే అని దాసు సురేష్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పెల్లూరి విజయ్‌కుమార్, ఊరుకొండసైదులు, అయితగాని శ్రీనివాస్, పీట్ల స్వర్ణకుమార్, నక్క అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్టళ్లకు దీటుగా ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్స్

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమం కూడా ఏర్పాటు చేయబోతున్నాం.

ప్ర: పెరిగిన మెస్‌చార్జీలు అమల్లో ఉన్నాయా?

జ: ప్రభుత్వం పెంచిన మెస్, కాస్మోటిక్ చార్జీలు అమల్లో ఉన్నాయి. 3నుంచి 7తగరతి విద్యార్థులకు రూ.1,330, 8నుంచి 10తరగతి వారికి రూ.1,540, ఇంటర్ ఆపైన విద్యార్థులకు రూ.2,100 మెస్‌చార్జీలు అందిస్తున్నాం. అలాగే కాస్మోటిక్ కింద నెలకు 7వ తరగతి లోపు వారికి రూ.175, ఆపై విద్యార్థులకు రూ.275 అందిస్తున్నాం. బాలికలకు అదనంగా ఇస్తారు.

ప్ర: మెనూ ఎలా అమలు చేస్తున్నారు?

జ: ప్రభుత్వం సూచించిన టైం టేబుల్ ప్రకారం హాస్టల్‌లో మెనూ అమల్లో ఉంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, సెలవుల్లో హాస్టల్స్‌లో లంచ్, సాయంత్రం డిన్నర్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి హాస్టల్‌లోనూ ట్యూటర్స్‌ను ఏర్పాటుచేశాం.

ప్ర: హైస్కూల్, ఇంటర్ విద్యార్థులు కాకుండా ఉన్నత విద్యార్థులు హాస్టల్స్‌లో చదివే అవకాశం ఉందా ?

జ: ప్రస్తుతం ప్రభుత్వం సాంఘిక సంక్షేమహాస్టల్స్‌లో ఇంజనీరింగ్, మెడిసిన్, ఎంబీఏ, పీజీ, డిగ్రీ చదవుతున్న విద్యార్థులు కూడా అడ్మిషన్లు ఇస్తోంది. ప్రైవేటు హాస్టల్స్‌కంటే ప్రభుత్వ హాస్టల్స్‌లో చక్కటి భోజన వసతి ఉందని, ఉన్నత విద్య చదువుతున్న వారు కూడా అడ్మిషన్లు పొందుతున్నారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ నడుస్తోంది. హైస్కూల్, ఇంటర్ విద్యార్థులకు జులై వరకు, ఇంజనీరింగ్, మెడిసిన్ వారికి గడువు పూర్తయ్యేవరకు అడ్మిషన్ ఇస్తాం.



సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్

ప్ర: హాస్టల్స్‌లో వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయి. సిబ్బంది కొరత ఉందా ?

జ: ప్రస్తుతం హాస్టల్స్‌కు కొత్త రిక్రూట్‌మెంట్‌లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను నియమించాం. అలాగే మండలాల్లో ఉన్న హాస్టల్స్‌కు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పట్టణాల్లో హాస్టల్స్‌కు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది నెలకొసారి పరీక్షలు చేస్తారు. అవసరమైతే వెంటనే ఆసుపత్రికి తరలిస్తారు.

గెజిటెడ్ అధికారులకు రాజీవ్ స్వగృహ ప్లాట్ల కేటాయింపు

- టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటరీ జనరల్ ఏలూరి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ స్వగృహ ప్లాట్లు తెలంగాణ గెజిటెడ్ అధికారులకు ప్రభుత్వం కేటాయించిందని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశం టీజీవో భవనంలో జిల్లా అధ్యక్షుడు కట్ట కిషోర్, కార్యదర్శి డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ సమావేశంలో సొసైటీకి చెందిన పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో అసంపూర్తిగా మిగిలిన రాజీవ్ స్వ గృహ ప్లాట్లను టీజీవోలకు కేటాయించినట్లు తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనినీ ఏ విధంగా చేయాలనే అంశాలపై చర్చించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు స్థాయిలో ఖమ్మం జిల్లాలో గెజిటెడ్ ఉద్యోగులకు గేటెడ్ కమ్యూనిటీ స్థాయిలో ఈ ప్లాట్స్‌ని నిర్మించనున్నట్లు తెలిపారు. 576 ప్లాట్స్ లో 1150గజాలతో 288 ,1450 గజాలతో 288 ప్లాట్స్ ఉన్నాయని. ఇప్పటివరకు హౌసింగ్ సొసైటీలో 975 మంది సభ్యత్వం తీసకున్నారని తెలిపారు. జూలై 10వ లోగా సభ్యులు ఖమ్మంలోని ఎన్నెస్పీ రోడ్ లో ఉన్న ఎస్బీఐ బ్యాంకులో రూ.2 లక్షల డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.


అనంతరం టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన గంగవరపు బాలకృష్ణ, జెడ్ జయపాల్ కు ఖమ్మం జిల్లా టీజీవో జిల్లా సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేల్పాద్రి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు, ఖమ్మం జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాస్ రావు, టీజీవో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, ట్రెజరర్ కొండపల్లి శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ ట్రెజరర్ రమేష్, డైరెక్టర్స్ మహేష్‌బాబు, సుధారాణి, డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు


దారుగాబంజరలో పామాయిల్ మొక్కలు నాటుతున్న రైతులు

ఆశల సాగులో.. పామాయిల్ వైపు



- ప్రభుత్వ చేయూత, మంత్రి తుమ్మల ప్రోత్సాహంతో రైతుల ముందడుగు
- దారుగాబంజరలో ఒకే రోజున పది ఎకరాల్లో సాగు షురూ
- ఓ యువ రైతు బాటలో మరి కొందరు

ఆశల సాగులో రైతన్నలు పామాయిల్ పంట వైపు అడుగులేస్తున్నారు. ఓ వైపు దీర్ఘకాల పంటగా భవిష్యత్.. మరో వైపు అంతరపంటలతో ప్రస్తుతం లాభదాయకం కావడంతో కల్లూరు మండల రైతులు చాలామంది ఈ వానాకాలంలో పామాయిల్ మొక్కలు వేస్తున్నారు. దారుగాబంజర గ్రామానికి చెందిన పలువురు రైతులు ఒకే రోజు పది ఎకరాల్లో మొక్కలు నాటించడమే ఇందుకు నిదర్శనం. పామాయిల్ సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ పథకాలతో పాటు ఈ ప్రాంత రైతులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇస్తున్న ప్రోత్సాహం సత్ఫలితాలనిస్తోంది. నియోజకవర్గంలోని వేంసూరులో నూతనంగా పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టడం కూడా ఇందుకు కలిసొస్తోంది.

కల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మెట్ట భూముల్లో పామాయిల్ సాగు చేయడంతో పాటుగా రవాణాకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి కలిగింది. ప్రస్తుతం దారుగాబంజర గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ శాతం పత్తి, మిర్చి పంటలను సాగు చేస్తున్నారు. అలాగే మామిడి సాగుకు వాతవరణం అనుకూలించక, చీడపీడల ప్రభావంతో తీవ్రంగా నష్టం వాటిల్లుతుండటంతో రైతులు చాలామంది ఆ పంటలకు గుడ్‌బై చెప్తున్నారు.



అంతర్ పంటలతో లాభదాయకం..

ఇతర పంటల కంటే పామాయిల్ సాగుతో దీర్ఘకాల లాభాలు రావడం, అంతరపంటలతో సగటున ఎకరానికి రూ.10 వేలు ఆదాయం వస్తుందని భావిస్తున్నారు రైతులు. ఈ క్రమంలోనే దారుగాబంజర గ్రామంలో ఈనెల 27న ఒకే రోజున పలువురు రైతులు పది ఎకరాల్లో పామాయిల్ మొక్కలు నాటారు. ఉద్యానశాఖ, అయిల్‌ఫెడ్ కార్పొరేషన్ సంస్థ తరుపున కూడా 90శాతం రాయితీపై ఎకరానికి సగటున 57 మొక్కలు, డ్రిప్ సౌకర్యం, సాగు నిర్వహణలో పెట్టుబడిగా ఎకరానికి రూ.4,200 అందించనుండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మొక్కలు వేసిన మూడేళ్ల తర్వాత పామాయిల్ దిగుబడి వస్తుంది. ఈ క్రమంలో ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉండటం రైతులకు లాభదాయకంగా మారుతోంది. ఈ క్రమంలోనే దారుగాబంజరకు చెందిన యువ రైతు యస్‌కె ఖాదర్ తన రెండెకరాల మెట్ట భూమిలో పామాయిల్ సాగుకు శ్రీకారం చుట్టాడు. అంతేకాకుండా తోటి రైతులకు అవగాహన కల్పించటంతో ఆయనను ఆదర్శంగా తీసుకోని మరికొందరు రైతలు పామాయిల్ సాగు చేపట్టారు.

మంత్రి తుమ్మల ప్రోత్సాహం



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పామాయిల్ సాగును విస్తరించడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పలు ప్రాంతాల్లో అధికారికంగా పర్యటిస్తూ పామాయిల్ సాగుకు రైతులను ప్రోత్సాహిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు క్రమంగా పామాయిల్ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో మంత్రి తుమ్మల రైతులకు అందుబాటులో ఉండేలా సత్తుపల్లి నియోజకవర్గం ప్రాంతంలోని వేంసూరు మండలంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కృషి చేశారు. అది కూడా రైతుల్లో ధైర్యం నింపింది. భవిష్యత్‌పై ఆశలు చిగురింపజేసింది.

లాభదాయకంగా పామాయిల్ సాగు
ఎస్కే ఖాదర్, యువరైతు



పామాయిల్ సాగుతో లాభదాయకంగా ఉంటుంది. ఇప్పటికే తమ గ్రామంలో మెట్ట భూముల్లో పత్తి, మిర్చి సాగు చేశాం. అంతర్‌పంటగా పామాయిల్ సాగు చేపట్టాం. వాతరవరణం చీడపీడలను తట్టుకుంటుందని ఈ పంటపై దృష్టి పెట్టాం. ప్రభుత్వం నుంచి పంట సాగులో రాయితీ పథకాలు అందుతున్నాయి. దీంతో రైతులకు పంట సాగులో పెట్టుబడి ఖర్చులు తగ్గతాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడ తమను ప్రోత్సహించటంతో ఈ పంటపై దృష్టి సారించాం.

మామిడి సాగుకు విరామం
మందడపు కృష్ణారావు రైతు



మామిడి సాగులో తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది. దీంతో ఈ ఏడాది ఆ పంటకు విరామం పలికాం. పామాయిల్ సాగుతో పంట దిగుబడి ఆశాజనకంతో పాటుగా లాభం చేకూరుతుంది. తమ గ్రామంలో యవ రైతు ఖాదర్‌ను ఆదర్శంగా తీసుకోని తాము ఈ పంటను సాగు చేసేందుకు ముందుకు వచ్చాం. పత్తి, మిర్చి పంటలను సాగు చేస్తే పలు రకాల చీడపీడలతో పంట నష్టంతో పాటుగా గిట్టుబాటు ధర అందని పరిస్థితి. దీంతో అంతర్‌పంటగా పామాయిల్ సాగును చేపట్టాం.

సోషల్ మేనియా



- గ్లోబల్ కమ్యూనికేషన్ వ్యవస్థగా మారిన సోషల్ మీడియా
- ఫేస్‌బుక్ నుంచి మొదలై అనేక మాధ్యమాలు ..
- సమాజాన్ని ప్రభావితం చేస్తున్న ఆన్‌లైన్ యాప్స్
- తెలివిగా వ్యవహరిస్తేనే ఫలితం

ప్రపంచాన్ని చేతిలో పట్టే శక్తిగా మార్చింది సోషల్ మీడియా. రోజు ఆరంభం 'గుడ్ మార్నింగ్ స్టేటస్' తో మొదలై, నిద్రించే ముందు షార్ట్ వీడియోలతో ముగుస్తోంది. పల్లెల్లోనూ పట్టణాల్లోనూ నెట్ వాడకం అమాంతం పెరిగింది. ఇంటర్నెట్ ప్లాన్‌ల ధరలు తగ్గడం, స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి రావడం, ఇలాంటి పరిణామాలు యువతను సోషల్ మాధ్యమాల వైపు నడిపించాయి. వాట్సాప్ గ్రూపుల్లో చర్చలు, ఇన్‌స్టా రీల్స్‌లో టాలెంట్ ప్రదర్శన, యూట్యూబ్ చానళ్లతో విజ్ఞాన ప్రసారం... ఇవన్నీ ఇప్పుడు నిత్యక్రియగా మారాయి. కేవలం వినోదం కాదు, జ్ఞానవంతమైన సమాచారం కోసం కూడా, సోషల్ మీడియా ఒక విస్తృత వేదికగా మారుతోంది. ఒక్కక్లిక్‌తో ప్రపంచం కళ్ల ముందుకు రావడం సాధ్యమయ్యింది. ఇది నూతన సమాచార విప్లవానికి మార్గదర్శిగా నిలుస్తోంది. జూన్ 30న ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ప్రభావం 2002లో పేస్‌బుక్ ద్వారా మొదలైంది. తర్వాత అనేక మాద్యమాలు సోషల్ మీడియాలో చేరాయి. గ్లోబల్ కమ్యూనికేషన్ వ్యవస్థగా సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తుంది. ఏదైనా సంఘటన జరిగితే క్షణాల్లో ప్రపంచ వ్యాప్తంగా పొటోలు, వీడియోలతో సహా పంపించుకునే నెట్‌వర్క్‌లు పుట్టుకొచ్చాయి. యూట్యూబ్, పేస్‌బుక్, టుంబ్లర్, వాట్సాప్, ఇన్‌స్ట్రాగ్రామ్, ట్విట్టర్, లింక్డ్‌ఇన్ ఇలా వందకు పైగా నెట్‌వర్క్‌లు సోషల్‌మీడియా వేదికగా ప్రజలకు చేరువయ్యాయి. కుటుంబ సభ్యుల నుంచి స్నేహితులు వరకు, ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేందుకు, వ్యాపారాల నుంచి విపత్తుల వరకు సోషల్ మీడియా ప్రధాన మాధ్యమంగా మారింది.

నేడు ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం

ప్రపంచానికి పలుకరింపు..

ఖమ్మం జిల్లా యువత ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా ప్రపంచాన్ని పలుకరిస్తున్నారు. వైరా, పాలేరు, సత్తుపల్లిలోని పలువురు ఔత్సాహికులు నెట్టింట స్వస్థల ప్రతిభను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. డ్యాన్స్, నటన, గేయం, స్కిట్, జోక్స్, ఫొటోగ్రఫీ ఎందరినో లక్షల వ్యూస్‌తో స్మార్ట్‌ఫోన్ స్టార్లుగా మార్చింది. వీరి వీడియోలు తరచూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాపులర్ అవుతున్నాయి. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా వినియోగిస్తున్నారు.

అపాయాలను గుర్తించాలి



వాడకం వెనుక బాధ్యత కూడా అవసరం. సోషల్ మీడియా గొప్పదే కానీ, దానికి ఉన్న దుష్పరిణామాలను నిర్లక్ష్యం చేయలేం. వాట్సాప్‌లో ఫేక్ న్యూస్, మిస్‌ఇన్‌ఫర్మేషన్, అపప్రచారాలు అడుగడుగునా సమస్యలు కలిగిస్తున్నాయి. ఖమ్మంలో కొన్ని సందర్భాల్లో పుకార్ల వల్ల అశాంతి నెలకొంది. సైబర్ మోసాలు, ఫేక్ ఐడీల ద్వారా తప్పుడు ప్రచారాలు పెరిగాయి. జిల్లా పోలీస్ శాఖ సైబర్ సెల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. లింక్‌లను క్లిక్ చేసే వేళ స్పష్టత ఉండాలి, షేర్ చేసే ముందు నిజానిజాలు తెలుసుకోవాలి. భయాందోళన కాకుండా, బాధ్యతగల పౌరుల్లా వ్యవహరించాలి.ఇదే నిజమైన సోషల్ మీడియా పట్ల నిబద్ధత.



విద్యా సంస్థలు కూడా డిజిటల్ క్లాసులు, ఆన్‌లైన్ వెబ్‌నార్లను ప్రోత్సహిస్తున్నాయి. ఒకప్పుడు దూరంగా కనిపించిన అవకాశాలు, ఇప్పుడు అతి దగ్గరగా ఉన్నాయి. ఇది కేవలం ఆన్‌లైన్ పబ్లిసిటీ కాదు, ఒక కొత్త పంథాగా మారింది.

డిజిటల్ వ్యవసాయం..

ఖమ్మం జిల్లా రైతులు కూడా సోషల్ మీడియా దిశగా అడుగులు వేస్తున్నారు. విత్తనాల ఎంపిక నుంచి పంటల యాజమాన్యం వరకు, సలహాలు, సూచనలు, వ్యవసాయ వీడియోల ద్వారా అవగాహన పెంచుకుంటున్నారు. వాట్సాప్ గ్రూపులు గ్రామీణ రైతులకు విశ్వాస వేదికలుగా మారాయి. పొలం కష్టాలను పంచుకునే ఒక సమూహ భావన ఏర్పడుతోంది. పంటల ధరల సమాచారం, ఆదాయ మార్కెట్ విశ్లేషణలు, టెక్నిక్‌లు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై వీడియోలు.. ఇవన్నీ సోషల్ మాధ్యమాలే. తిరుమలాయపాలెం, రఘునాథపురం తదితర గ్రామాల రైతులు ఆన్‌లైన్ పరుగులు పెడుతున్నారు. సాంకేతికత సామాన్య రైతును స్మార్ట్ అగ్రికల్చర్ వైపు నడిపిస్తోంది.

ప్రచారానికి వేదికగా..

రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలకు ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి సామాజిక మాధ్యమాలను వాడుతున్నాయి. ప్రజలకు ప్రత్యక్షంగా చేరేందుకు లైవ్ స్ట్రీమింగ్, రీల్స్ వీడియో సందేశాలు వంటి టూల్స్‌ను సృష్టించుకుంటున్నాయి. నాయకుల దినచర్య, కార్యక్రమాలు, సందర్శనలు, మాటల వీడియోలుగా ఆన్‌లైన్‌లో పోస్ట్ చేస్తున్నారు. ప్రతీ పార్టీకి ప్రత్యేక డిజిటల్ టీమ్ ఉంటుంది. వీరు ట్రెండ్స్‌ను పర్యవేక్షిస్తూ వెంటనే స్పందిస్తున్నారు. నెట్టింటి వేదికగా ప్రత్యర్థులపై విమర్శలు, దాడులు కూడా జరుగుతుంటాయి.

ఒకరిపై పీడీ యాక్టు అమలు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న పగడాల విజయ్ అలియాస్ చంటి(35)పై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదివారం తెలిపారు. ఖమ్మంఅర్బన్ పోలీసుస్టేషన్ పరిధిలోని అగ్రహారం న్యూకాలనీకి చెందిన పగడాల విజయ్ హత్యాయత్నం, దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు, గుండాయిజం, వంటి పలు కేసులలో కీలకమైన నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. ఇతడి నేరాలకు శాశ్వతంగా చెక్ పెట్టడానికి పీడీ యాక్ట్ అమలు చేసి నిందితుడిని ఖమ్మం ఖానాపురం హవేలి ఇన్‌స్పెక్టర్ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చంచల్‌గూడ సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు తెలిపారు.

గాయపడిన సింగరేణి కార్మికుడి మృతి

రుద్రంపూర్, (సింగరేణి), జూన్29(ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియా జేవీఆర్ ఓసీలో విధులు నిర్వహిస్తున్న నిమ్మల రాంచందర్ గత నెల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయాలపాలైన రాంచందర్‌కు మెరుగైన వైద్య చికిత్సలు అందించినప్పటికీ ఆదివారం మృతిచెందాడు. రాంచందర్ భౌతికాయానికి ఐఎన్‌టీయూసీ నాయకులు ఎంఈ రజాక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు సంతాప సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఎస్‌కే గౌస్, చిలక రాజయ్య, పోశం శ్రీనివాస్, కొమరయ్య, రాజేశ్వరరావు, విజయ్, మోహన్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా తిని మేకల మృత్యువాత


మృత్యువాత పడిన మేకలు

ములకలపల్లి, జూన్29 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి మండలం మాదారం గ్రామపంచాయతీ మంగపేట గ్రామానికి చెందిన వాడే దారయ్యకు చెందిన 12మేకలు ఆదివారం మృత్యువాత పడ్డాయి. రోడ్డుపైన పడిన యూరియాను మేకలు తిని మృతి చెందాయని వాటి విలువ సుమారు 1,50,000 ఉంటాయని బాధితుడు తెలిపారు.


11 కిలోల గంజాయి పట్టివేత

పాల్వంచ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 11కిలోల గంజాయిని పాల్వంచ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను ఆదివారం న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. పోలీసుల కథనం ప్రకారం చింతకాని మండలానికి చెందిన కందిమళ్ల శ్రీహరి, జొన్నలగడ్డ రాకేష్‌రెడ్డి, బోనకల్లు మండలానికి చెందిన జావీద్ మరో ముగ్గురు స్నేహితులతో కలిసి శనివారం సాయంత్రం కారులో గంజాయిని ఖమ్మం తీసుకెళుతున్నారు. మార్గమధ్యలో పాల్వంచలోని జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న టౌన్ ఎస్‌ఐ సుమన్ అనుమానం వచ్చి వారి వాహనాన్ని అడ్డగించారు. దీంతో కారులోని ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. మిగిలిన వారిని అదులోకి తీసుకుని కారును తనిఖీ చేయగా అందులో 11 కేజీల ఎండు గంజాయి బయటపడింది. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

1100గ్రామాలు గంజాయి..

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని జహీర్‌పుర రైల్వే వంతన వద్ద ఆదివారం ఎస్‌ఐ కొండల్‌రావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలలో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోని 1,100 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు త్రీ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపారు.

కేఎంసీ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్



ఖమ్మం కార్పొరేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు సరికొత్తగా పథకాలు వేస్తూ ప్రజల నుంచి డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్ ఆదివారం ఖమ్మం నగరంలో సంచలనంగా మారాయి. కమిషనర్ అనుదీప్ అంటూ పేరు చెప్పి మీకు వచ్చిన ఓటీపీ నెంబర్ చెపితే వ్యాపార లైసెన్స్‌లు, ఇంటి పన్నులు, ఇతర పనులు చేస్తామంటూ 93464 23925 నెంబర్ నుంచి కొంతమందికి ఫోన్‌లు వచ్చినట్లు కేఎంసీ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో అప్రమత్తమైన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజలు ఇటువంటి ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేఎంసీ నుంచి ఎవ్వరినీ ఓటీపీ నెంబర్లు అడగటం జరగదన్నారు.

శరవేగంగా అండర్ టన్నెల్ నిర్మాణం

- సాగర్ కాల్వపై పాలేరు వద్ద కొనసాగుతున్న పనులు
- మరో వారం, పదిరోజుల్లో పూర్తిచేసేలా చర్యలు

కూసుమంచి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాల్వపై పాలేరు వద్ద అండర్ టన్నెల్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత ఏడాది సెప్టెంబరు 1న ఊహించని వరదలతో పాలేరు జలాశయానికి సమీపంలో సాగర్ కాల్వపై 134.5 కిలోమీటరు (మల్లాయిగూడెం) వద్ద గండి పడింది. ఆప్రాంతంలోనే అండర్ టన్నెల్ (యూటీ)కూలిపోయింది. ఎగువన మొదటిజోన్ పరిధిలో సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురంలో 132.5 కిలోమీటరు వద్ద భారీగా గండ్లు పడ్డాయి. వెంటనే తాత్కాలికంగా పనులు నిర్వహించి రైతులకు ఖరీఫ్, యాసంగి పంటలకు నీరు అందించారు. ఈక్రమంలో శాశ్వత నిర్మాణాల్లో భాగంగా యూటీ నిర్మాణం, కాల్వల లైనింగ్ పనులను రూ.14కోట్లతో చేపట్టారు.

రేయింబవళ్లు పనులు

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాలతో రేయింబవళ్లు పనులు నిర్వహిస్తున్నారు. వానాకాలం సీజన్ ముంచుకొస్తుండటంతో ముందుగా యూటీ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల పలుమార్లు పనులను తనిఖీ చేసిన మంత్రి.. అధికారులకు పలుసూచనలు చేశారు. ఫలితంగా పనులు ప్రారంభించిన 45రోజుల కాలంలోనే 50శాతం పనులు పూర్తయ్యాయి. గతంలో యూటీని 1970 ప్రాంతంలో నిర్మించారు. అడ్డగోడలను రాళ్లతో నిర్మించడం మూలంగా రాళ్లన్నీ ఒక్కొక్కటి ఊడిపోయి కూలిపోయింది. అయితే ఈసారి భిన్నంగా రెయిన్‌ఫోర్స్ కాంక్రీట్ నిర్మాణం చేస్తున్నారు. గతంలో యూటీకి రెండు అరలు మాత్రమే ఉండగా.. ఈసారి మూడు అరలు నిర్మాస్తున్నారు. గతంలో కేవలం 9మీటర్ల వెడల్పు ఉండగా, సుమారు 11మీటర్లు నిర్మిస్తున్నారు. 77 మీటర్ల పొడవు నిర్మిస్తున్నారు. ఊట నీరు ఎంతవచ్చినే వెంటనే యూటీలోనుంచి ఏటిలోకి ప్రవహించేలా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. జూలై 10వతేదీనాటికి యూటీ పనులు పూర్తయ్యేలా రేయింబవళ్లు షిఫ్టులవారీగా పనులు నిర్వహిస్తున్నారు. పాలేరు జలాశయం నుంచి ఎడమకాల్వకు ఇరువైపులా సుమారు 600 మీటర్ల లైనింగ్ దెబ్బతిన్నది. యూటీ నిర్మాణం అనంతరం లైనింగ్ పనులు చేపడతామని అధికారులు తెలిపారు.


కూసుమంచి మండలం పాలేరు వద్ద జరుగుతున్న యూటీ నిర్మాణం

నిత్యం పనుల పర్యవేక్షణ

ఎడమకాల్వపై నిర్మిస్తున్న యూటీపనులు నీటిపారుదల ఖమ్మం సర్కిల్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు. ప్రతిరోజుల పాలేరు వచ్చి పనులు వేగంగా నాణ్యతగా జరిగేవిధంగా చూస్తున్నారు. ఖరీఫ్‌కు సాగర్ జలాలు విడుదల చేసేనాటికి యూటీపనులు పూర్తయ్యేలా కృషిచేస్తున్నట్లు ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. పనులను పారదర్శకంగా, నాణ్యతతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. యూటీ పనులు పూర్తయిన వెంటనే లైనింగ్ పనులు పూర్తిచేస్తామన్నారు.

మినీ హైడల్ వద్ద..

పాలేరు మినీహైడల్ వద్ద కూడా కాల్వకు గతంలో గండి పడింది. అయితే జెన్‌కో శాఖ ఆధ్వర్యంలో పనులు పూర్తికావచ్చాయి. ఇప్పటికే కాల్వకట్టకు మట్టిపోసి పెద్దపెద్ద రోలర్లసాయంతో మట్టిని తొక్కించారు. అదేవిధంగా లైనింగ్ పనులు పూర్తిచేశారు. బయట గేటువద్ద నుంచి ప్రాజెక్టు వరకు కొత్తగా సీసీ రోడ్డు నిర్మించారు. అదేవిధంగా ప్రాజెక్టులో మిషనరీ మొత్తం నీటమునిగి, మట్టిచేరింది. వాటిని మొత్తం శుభ్రం చేసి కొత్తగా అవసరమైన వైరింగ్‌లు, బేరింగ్‌లు ఏర్పాటుచేస్తున్నారు. నీటి విడుదల సమయానికి ప్రాజెక్టు మరమ్మతులను పూర్తిచేసి విద్యుతుత్పత్తికి సిద్ధం చేస్తున్నట్లు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.

వార్షిక రుణ ప్రణాళిక ఖరారు

- బ్యాంకర్ల సహకారంతోనే లక్ష్య సాధన
- కౌలు రైతులకు అందని రుణ సాయం

కొత్తగూడెం అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ, ఇతర రంగాలకు రుణ పంపిణీ కోసం ప్రతి సంవత్సరం స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) రుణ ప్రణాళిక రూపొందిస్తుంది. ప్రతి సంవత్సరం కేటాయింపులు పెంచుతూ ప్రణాళిక ఖరారు చేస్తున్నా.. రుణ పంపిణీ మాత్రం 70శాతం మించడంలేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 2025-26 వార్షిక రుణ ప్రణాళిక రూ.7,700.87కోట్లు ఖరారు చేశారు. జిల్లాలో 2,26,349లక్షల వరకు రైతులు ఉన్నారు. ఈ వానాకాలంలో 5,90 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని అధికారుల అంచనా. అయితే పట్టాదారులు చాలామంది బ్యాంకు రుణాలు అందక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రతి సంవత్సరం 2,27,099 మందికి బ్యాంకు రుణాలు అందుతున్నాయని, జిల్లాలో సుమారుగా 20వేలకు పైగా కౌలు రైతులు ఉండగా.. వారికి వడ్డీ వ్యాపారులే దిక్కు. గత ఏడాది రుణ ప్రణాళిక రూ.5,242.49 కోట్లు లక్ష్యంకాగా.. రూ.3,960.63 కోట్లు పంపిణీ చేశారు. వీటిల్లో పంట రుణాల లక్ష్యం రూ.2,423.76 కోట్లు ఉండగా అన్ని బ్యాంకర్లు కలిపి రూ.1,693.26కోట్లు 69.86 శాతం మాత్రమే పంపిణీ చేశారు.

గతం కంటే అధికంగా...

తాజగా 7700.87 కోట్లతో రుణ ప్రణాళిక ఖరారు చేశారు. గతంతో పోలిస్తే 46 శాతం నిధులు పెంచారు. వీటిల్లో పంట రుణాలు రూ.2,230.53కోట్లు, టర్మ్ లోన్లు రూ.9,43.50కోట్లు, వ్యవసాయ మౌలిక వసతులకు రూ.31.41కోట్లు, అనుబంధ కార్యక్రమాలకు రూ.472.59 కోట్లు, ఈవిధంగా మొత్తం వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 3838 కోట్లు కేటాయించారు. ఏటాఏటా లక్ష్యాలు పెంచుతున్నా పంపిణీ సగం మాత్రమే ఉందనే విమర్శలు స్థానికంగా ఉన్నాయి.

పంపిణీ అంతంతమాత్రమే..

వ్యవసాయ రుణాలే కాకుండా దాని అనుబంధ, మహిళా సంఘాలు, స్వయం ఉపాధి, చిన్న మధ్య తరహా పరిశ్రమలు విద్య, గృహ నిర్మాణాలు, తదితర వాటికి రుణ పంపిణీ కోసం ఏటా ప్రణాళికలు తయారుచేసి బ్యాంకర్ల వారీగా లక్ష్యాలు కేటాయిస్తున్నారు. పంపిణీవంతు వచ్చేసరికే డీలా పడుతున్నారు. పాత ఖాతాదారులకు కొంతమేర కలిపి ఇచ్చి పుస్తక సర్దుబాటు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. కొత్తవారికి మంజూరు కోసం కొందరు బ్యాంకర్లు కొర్రీలు పెడుతున్నాట్లు రైతులు చెబుతున్నారు.

25-26 వార్షిక రుణ ప్రణాళికలో రంగాల వారీగా నిర్దేశిత లక్ష్యాలు (రూ. కోట్లలో)
పంటల రుణాలు రూ.3,646.62
వ్యవసాయ అనుబంధ రంగాలు రూ.191.38
చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రూ.847.80
ఇతర ప్రాధాన్యత రంగాలు రూ.198.19
పునరుత్పాదక రంగాలు రూ.2,816.88



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
సోమవారం 30 జూన్ 2025
ఖమ్మం సిటీ ZONE
● ఖమ్మం ● రఘునాథపాలెం ● ఖమ్మం రూరల్ ● తిరుమలాయపాలెం ● కూసుమంచి ● నేలకొండపల్లి ● కామేపల్లి



జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల కమిటీ ఎన్నిక


రమణ


షఫీ

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పీవీ. రమణ, సెక్రెటరీగా ఎండీ. షఫీక్‌అహ్మద్, ట్రెజరర్‌గా జీ.సైదేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా వై. రామారావు, ఈ.భాగ్య మ్మ, కార్య నిర్వాహక కార్యదర్శిగా ఎస్‌కే. నాగుల్‌మీరాను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర పీఈటీల సంఘం సెక్రటరీ కె. కృష్ణమూర్తి, నల్గొండ జిల్లా పెటా అధ్యక్షుడు చంద్రయ్య, సూర్యాపేట జిల్లా పెటా సెక్రటరీ శ్రీనివాస్‌లు వ్యవహరించారు.

విద్యా వ్యవస్థపై చిన్న చూపు తగదు

» పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్


సమావేశంలో మాట్లాడుతున్న వంగూరి వెంకటేష్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్ ధ్వజమేత్తారు. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పృథ్వీ, వినయ్, సందీప్, ప్రసాద్, అశోక్, స్టాలిన్, నరేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక సేవకుడు సీతారాం'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ, రచయిత్రి ఓల్గా

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సీతారాం అంటే కేవలం కవి, విమర్శకుడు, అధ్యాపకుడు మాత్రమే కాదు, బహుముఖీన సామాజిక సేవకుడని ప్రముఖ రచయిత్రి ఓల్గా అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీతారాం రాసిన కనుక కవితా సంపుటి ఆవిష్కరణ పుస్తక సందర్భంగా మిత్రుల ఆధ్వర్యంలో సెలబ్రేషన్స్ ఆఫ్ టీచింగ్ కార్యక్రమానికి రచయిత్రి ఓల్గా, మాజీ మంత్రి పువ్వాడ. అజయ్‌కుమార్‌లు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త రవిమారుత్, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిలింగ్ సభ్యుడు ప్రసేన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె. నీరజ, ఐవీ.రమణారావు, కెఎస్.రామారావు, వాసిరెడ్డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెంకయ్య ఆశయాలు సాధించాలి


వెంకయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కందాళ, తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య

నేలకొండపల్లి, జూన్29(ఆంధ్రజ్యోతి): రాజేశ్వరపురంలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ నాయకుడు బండారు వెంకయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూధన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకయ్య ఆశయాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో మృతుని కుమారుడు ఉస్మానియా యూనివర్శిటీ జేఏసీ నాయకుడు బండారు వీరబాబు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, సీడీసీ మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, దండా రంగయ్య, జటంగి వెంకన్న, బోనగిరి కిరణ్, అనగాని నర్సింహారావు, నంబూరి సత్యం, కోటి సైదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడండి

» సీపీఎం జిల్లా నాయకుడు బషీరుద్దీన్


సమావేశంలో మాట్లాడుతున్న బషీరుద్దీన్

తిరుమలాయపాలెం, జూన్29(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై కార్యకర్తలు పోరాడాలని సీపీఎం జిల్లా నాయకుడు షేక్. బషీరుద్దీన్ తెలిపారు. ఆదివారం తిరుమలాయపాలెంలోని పార్టీ కార్యాలయంలో టి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మంగతాయి, వీరన్న, లింగయ్య, లింగస్వామి, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల దీక్షలను విజయవంతం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమసంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జులై 3,4,5తేదీలలో హైదరాబాదులో జరిగే ఉద్యమకారుల దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు పాలకుర్తి కృష్ణ కోరారు. ఈమేరకు ఆదివారం నరగంలోని అమరవీరుల స్థూపం వద్ద దీక్ష పోస్టర్లను తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామా అంజిరెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం సాగిన ఉద్యమంలో అనేకమంది తమప్రాణాలను త్యాగం చేశారన్నారు. అనేకమంది జైళ్లపాలయ్యారన్నారు. అలాంటి త్యాగధనుల ఫలితంగా నేడు తెలంగాణ రాష్ట్రం అవతరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులుక ఇచ్చిన హామీలను నేటికి అమలు చేయలేదన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడానికి జులై 3,4,5తేదీలలో హైదరాబాదులోని ఉస్మానియా క్యాంపస్‌లో తెలంగాణ అమరవీరుల ప్రాంగణంలో దీక్షా కార్యక్రమాలు నిర్వహించడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమలో పరకపల్లి యల్లయ్య, రాతికొండ ల్‌రావు, బట్టురాజేందర్, చౌహాన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా బెరైటీస్ తవ్వకాలు

» పగలు తవ్వకం, రాత్రి తరలింపు
» పట్టించుకోని అధికారులు



వెలుగుమట్ల ప్రాంతాల్లో కూలీలతో అక్రమంగా తవ్వకాలు జరిపిన దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్ ప్రాంతాల్లో విస్తారంగా ముడి ఖనిజం బెరైటీస్ నిల్వలు ఉన్నాయి. రూ.కోట్ల విలువ చేసే బెరైటీస్ ముడి ఖనిజాన్ని కొందరు అక్రమార్కులు పగలు తవ్వకాలు జరిపి, రాత్రి వేళ్లల్లో లారీల్లో తరలిస్తున్నారు. గతంలో రెండు, సార్లు ఆంధ్రజ్యోతిలో అక్రమ తేలకాలపై వార్తలు ప్రచురించడంతో మైనింగ్ అధికారులు ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేసినప్పటికీ, అక్రమ వ్యాపారులు సెలవు దినాలలో అక్రమ బైరటీస్ తవ్వకాలు జరపడం, రాత్రి పూట తరలించటం వంటి కార్యక్రమాలకు తెరలేపారు. గతంలో ఎక్స్‌కవేటర్లు, పొక్లెయిన్ తదితర యంత్రాలతో బెరైటీస్‌ను తవ్వే అక్రమార్కులు, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అడ్డా మీద కూలీలను తీసుకువచ్చి బెరైటీస్ తవ్వి బయటకు తరలిస్తున్నారు. బయటకు తీసుకవచ్చిన బైరటీస్‌ను దగ్గరలోని గోపాలపురంలో ఓ మూతపడ్డ పరిశ్రమ వద్దకు డంప్ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. గతంలో బెరైటీస్ తవ్వకాలు జరిగిన ప్రాంతాలను ఆయా భూ యజమానులు భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసుకోవడంతో పెద్దపెద్ద యంత్రాలు లోపలికి పోయే పరిస్థితి లేకపోవటంతోనే కూలీలతో పని చేయాల్సి వస్తుందని తెలుస్తుంది.

సెలవు దినాలే వారి టార్గెట్

సెలవు దినాలలో అధికారుల కదలికలు లేకపోవడంతోనే ఈ ప్రాంతంలో బెరైటీస్ అక్రమ తేలకాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో రాత్రిపూట తవ్వకాలు జరిపే అక్రమ వ్యాపారులు నేడు పట్టపగలే తవ్వకాలు జరుపుతున్నారంటే కొందరి అధికారుల సహకారం ఏవిధంగా ఉందో చెప్పవచ్చు. గతంలో పలుమార్లు ఆంధ్రజ్యోతిలో వచ్చిన బెరైటీస్ అక్రమ తవ్వకాల వార్తకు మైనింగ్ అధికారులు సంబంధిత ప్రాంతానికి వెళ్లి అక్రమ బెరైటీస్‌ను స్వాధీనపరుచుకున్నారు. కానీ ఆ బెరైటీస్‌ను అదే ప్రాంతంలో ఉంచడంతో కొన్ని రోజుల అనంతరం ఆబైరటీస్‌ను అక్రమ వ్యాపారులే రాత్రి వేళ్లలో తరలించారని అందుకు అధికారుల సహకారం అందించినట్లు తెలుస్తుంది.

రాత్రికి రాత్రే అధికారుల కళ్లుగప్పి లారీల్లో యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఖమ్మం అటవీ అర్బన్ పార్క్ ప్రాంతాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ ప్రయివేటు భూముల్లో ఉన్న బెరైటీస్ ముడి ఖనిజాన్ని రాత్రి వేళల్లో యథేచ్ఛగా తవ్వి తేలకాలు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతాల్లోని ప్రయివేటు భూముల్లో అక్రమ బెరైటీస్ తవ్వకాలు జరపగా మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్రమ బెరైటీస్‌ను సీజ్ చేసి వేలం పాటలో విక్రయించారు. దీంతో సంబంధిత భూముల యజమానులు ఆభూముల చుట్టూ గోడలు నిర్మించుకున్నారు. అయినా అక్రమదారులు ఈ ప్రాంతాలతోపాటు ఇతర భూముల్లో కూలీలతో తవ్వకాలు జరిపి ముక్కలు ముక్కలుగా చేసి బయటకు తరలించి రాత్రి పూట లారీల్లో తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. బెరైటీస్ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఫాసిస్టు పోకడలతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

» సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ ఫాసిస్టు పోకడలతో ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం ఏర్పడుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 11ఏళ్ల పరిపాలనలో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు నిర్ణయాలు చేశారన్నారు. ఈ క్రమంలో నిరుపేదలు, గ్రామీణ, రైతాంగం, పట్టణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం పెరిగి నిరుద్యోగం తారాస్థాయిలోకి చేరిందని, ప్రజలు కొనుగోలు శక్తి దిగజారిపోయిందన్నారు. ప్రజల్లో మతతత్వ భావజాలాన్ని జొప్పించి వారి మధ్య అనైక్యతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. బండారు రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్, పోన్నం వెంకటేశ్వరరావు, సుబ్బారావు, మాచర్ల భారతి, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేశ్, సత్యనారాయణ, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా బోనాల జాతర

నేలకొండపల్లి, జూన్29(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని నేలకొండపల్లిలోని యాదవులు ఆదివారం ఆషాడ మా సం బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు బోనాలెత్తుకుని ఊరేగింపుగా బయల్దేరగా, యువకులు నృత్యాలు చేస్తూ బాణాసంచా కాలుస్తూ ఊరేగింపు ముందు నడిచారు. గంగమ్మ తల్లికి బోనాలు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కూరాకుల నాగేశ్వరరావు, మన్నె కృష్ణారావు, మెట్టెల నరేష్, మెట్టెల నాగేశ్వరరావు, మేకల శ్రీను, చిలకల రాములు, మన్నె రవి పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

గ్రామీణ క్రీడలపై దృష్టి పెట్టాలి


బహుమతులను అందజేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువకులు క్రీడలపై దృషి పెట్టాలని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో గత పది రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. విజేతలకు కాంగ్రెస్ నాయకుడు భాక్యా సురేష్‌నాయక్ రూ.25 వేలు, సైదులు రూ.15 వేల ప్రైజ్ మణిని దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దయాకర్‌రెడ్డి మాట్లాడుతు రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో పాటు క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని శారీరక దృఢత్వాన్ని పెంపొందించుతాయన్నారు. గ్రామీణ క్రీడాకారులు, విద్యార్థులు క్రీడలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు క్రీడలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ పంతులు నాయక్, ఆత్మ కమిటీ డైరక్టర్లు నాగార్జునరావు, మహేష్, కిషోర్ రెడ్డి, కిరణ్, నవీన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి

» టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను స్థాపించి ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు విజయ్, పద్మ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంగళరావు, ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు నాగిరెడ్డి, వీరబాబు, రమాదేవి, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్వర సుధా మ్యూజిక్ యూనిట్ ఖమ్మం వారి 33వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ గాయకులు రే వతి, స్వప్న, ప్రియాంక, కె. మాధవరావు, వీవీ. రెడ్డి పాడిన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం వనం కృష్ణవేణి, పూసలూరి. శ్రీలతలను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెలనెల వెన్నెల నిర్వాహకులు పాల్గొన్నారు.


సినీ గేయాలు పాడుతున్న గాయకులు

రోడ్డు పనులకు శంకుస్థాపన

తిరుమలాయపాలెం, జూన్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరవాయి గ్రామం నుంచి పీక్యాతండా వరకు సుమారు రూ.15కోట్లతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఏఎంసీ మాజీ డైరెక్టర్ బత్తుల రవికుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో పాలేరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్ యు.నాగేశ్వరరావు, చావా రామకృష్ణ, పల్లా వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన దృశ్యం

రాజ్యాంగాన్ని దెబ్బతీసేలా కేంద్రం కుట్రలు

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు

సత్తుపల్లిరూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదులు ఈ దేశ రాజ్యాంగాన్ని దెబ్బతీసేలా కుట్రలు సాగిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు అన్నారు. సీపీఐ పట్టణ 5వ మహాసభ స్థానిక తాపీ వర్కర్స్ భవనంలో నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యానికి ముందే పుట్టి దేశంలో సంపూర్ణ స్వాతంత్రం కావాలని నినదించి నాటినుంచి నేటివరకు పీడిత ప్రజల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) అన్నారు. సమాజాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీపీఐ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల మధ్య కులమతాల చిచ్చుపెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామాన్ని కేంద్ర ప్రభుత్వం ఖూనీ చేస్తోందని, హక్కుల కోసం అడిగినవారిని జైళ్లల్లో వేస్తూ రాజ్యాంగానికి విఘాతం కలిగించే పద్ధతుల్లో అప్రకటిత ఎమర్జెన్సీని నడిపిస్తుందని విమర్శించారు. జూలై 9న జరిగే సమ్మెలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రావి శివరామకృష్ణ, దండు ఆదినారాయణ, తడికమళ్ల యోబు, సముద్రాల సుధాకర్, ఎస్‌కే.రంజాన్, రామలక్ష్మీ, కాగిత వెంకటేశ్వర్లు, పాలకుర్తి వీరయ్య, పిల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలి

ఖమ్మం రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు బండి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన పేదలు ఇంకా ఉన్నారని, వారిని గుర్తించి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్నారు. అదేవిధంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలకార్యదర్శి సుదర్శన్ రెడ్డి, నాయకులు నందిగామ కృష్ణ, మోహన్‌రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు అజయ్‌కు నివాళులు

తిరుమలాయపాలెం, జూన్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పుల్లూరి అజయ్‌కు ఆదివారం వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అజయ్ మృతి చెందగా ఆదివారం టీడీపీ జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్ తదితరులు అజయ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా అజయ్ తండ్రి మల్సూర్‌ను పరామర్శించి ఓదార్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు మల్లెంపాటి అప్పారావు, మద్దెల లక్ష్మయ్య, మోహన్‌రావు, గాదరిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు సాయిబాబా ఆలయాలలో సోమవారం నుంచి గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. నగరంలోని రంగనాయకులగుట్ట(హర్కారబావి) నందు గల శ్రీ కృష్ణసాయి ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ లగడపాటి. రామారావు, జనరల్ సెక్రెటరీ సిద్దంశెట్టి. నాగమణిలు తెలిపారు. ఆలయంలో 25వ గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30 నుంచి జూలై 10 వరకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయి దీక్షలు స్వీకరించే భక్తులు సోమవారం తెల్లవారుజామున 5గంటలలోపు ఆలయంలో సంప్రదించాలని తెలిపారు. 30న గణపతి పూజతో వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 10న గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, 108 లీటర్లతో గోక్షీరాభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబావారిని దర్శించుకోని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



గత 36 సం॥లుగా పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొంది... మాకుటుంబ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మా నాన్నగారు శ్రీ వలపర్ల పద్మకుమార్ గారు నేడు ది.30-06-2025 న A.S.I. గా ఉద్యోగ విరమణ చేయుచున్న శుభవేళ మీకివే మా హృదయపూర్వక శుభాకాంక్షలు... మీ భావి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటూ మీ.....

శ్రీమతి & శ్రీ వలపర్ల పద్మకుమార్ - సిల్వరాణి గార్లు
A.S.I. 1టౌన్ పోలీస్‌స్టేషన్, ఖమ్మం
సెల్: 8897783751

కుమారులు - కోడళ్ళు
వలపర్ల ప్రవీణ్‌రాజ్ - శిరీష
వలపర్ల మోజీ - క్రాంతి
వలపర్ల విజయ్ కుమార్

అక్కలు - బావలు:
దాసరి లూసి - సూరిబాబు (లేటు)
కల్లోజి మనోహరం - జయరాజు

కుమార్తె: వలపర్ల జ్యోత్స్న.
మనవరాలు: బ్లాండి నాగ్రెస్
మనవడు: సచిన్

అన్న - వదిన:
వలపర్ల పురుషోత్తం - దేజి కమల

కూతుర్లు - అల్లుళ్ళు:
దాసరి సుప్రియా దేవి - దాసుబాబు
వలపర్ల ఎస్తేర్ ఏంజిల్ - ప్రతాప్

పదవీ విరమణ శుభాకాంక్షలు



మాకు అత్యంత ఆత్మీయులు శ్రీ రచ్చ రాజయ్య గారు TS.NPDCL నందు గత24 సం॥లుగా వివిధ హోదాలలో ఉత్తమ సేవలందించి నేడు Line Inspector గా ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భముగా మీకివే మా హార్దిక శుభాకాంక్షలు

శ్రీమతి & శ్రీ రచ్చ రాజయ్య - సత్యావతి గార్లు
Line Inspector, TS.NPDCL,
చీమలపాడు, సింగరేణి మం॥

కార్లపాటి సీతారామయ్య
Sr.Line Inspector పెద్దగోపతి, 1104 ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

పూజా సురేష్ 1104 ఖమ్మం జిల్లా అడిషనల్ సెక్రటరి

డీకొండ రమేష్‌బాబు
1104 ఖమ్మం టౌన్ డివిజన్ సెక్రటరీ

తాళ్లూరి వెంకటేశ్వరరావు
Line Inspector, ఖమ్మం టౌన్ - 2

కోనా నరసింహారావు
Line Inspector, పెద్దగోపతి, ఖమ్మం టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్

సుధా శ్రీనివాసరావు
Line Inspector, నాగులవంచ

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

WANTED
★ హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం కలదు. జీతం 18k సంప్ర. 9848999184 / 9640648899
AJH-15092

ఉద్యోగావకాశాలు
⊸ NK అగ్రో ఎక్స్‌పోర్ట్ Pvt.Ltd, తోడేళ్ళగూడెం గ్రా, డోర్నకల్ మం, మహబూబాబాద్ జిల్లాలో పని చేయుటకు చిల్లిపౌడర్ మెషినరీ ఆపరేటర్స్-3 No.s కావలెను. అర్హత: ITI / పాలిటెక్నిక్ డిప్లొమా (ఏదైనా బ్రాంచ్), మెషీన్ ఆపరేటర్‌గా 3 నుండి 4 సం.లు అనుభవము వుండాలి. సంప్ర॥ 9949976505, మెయిల్: hr@nkexpo.com
AJG-238772

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్వదేశాగమనము/ విదేశీయానం, | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం
షష్ఠిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి
పదవీవిరమణ | వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం: 9985401672
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు

మధిరరూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలు ఏమాత్రం పట్టించుకోకుండా మాయమాటలతో కాలం గడుపుతున్నాయని సీపీఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. ఆదివారం మధిరలోని బోడెపుడి భవన్‌లో జరుగుతోన్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆ పార్టీల నాయకులు ప్రజలకు అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి రాగానే ప్రజలను విస్మరిస్తున్నారని అన్నారు. పేదలకు అండగా ఉండేది ఎర్రజెండా ఒక్కటేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుల శీలం నరసింహారావు, పడకంటి మురళి, మంద సైదులు, పాపనేని రామనరసయ్య, వెంకరావు, రాధాకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో ఓ నివాస గృహంలో అక్రమంగా నిల్వ ఉన్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కల్లూరు పోలీసులు దాడి చేసి శనివారం రాత్రి పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలోని కరుకుల నరిసింహారావు, కరుకుల సత్యం నివాస గృహాల్లో పై విధంగా రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉండగా స్థానిక పోలీసులకు సమాచారం అందినది. దీంతో కల్లూరు ఎస్ఐ హరిత బియ్యం ఉన్న స్థావరంపై శనివారం రాత్రి దాడిచేసి బియ్యాన్ని సివిల్ సప్లైశాఖకు అప్పగించినట్లు ఎస్ఐ తెలపారు.

వైరా, మధిర రహదారిలో లారీ ప్రమాదం

వైరా జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవారం గ్రామం సమీపంలో రెండు లారీలు ఢీకొని ముందున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి వైరా రిజర్వాయర్ ప్రధాన కాలువలోకి దూసుకపోయింది. ప్రమాధంలో లారీ డ్రైవర్‌కు గాయలు అయ్యాయి. రాజమండ్రి నుంచి జగ్గయ్యపేట వెళ్తతున్న రెండు లారీలు సోమవారం గ్రామం అంజనేయ స్వామి ఆలయంలోని రిజర్వాయర్ ప్రధాన కాలువ సమీపంలో ప్రమాదవశాత్తు ఒకదాని వెనక మరో లారీ ఢీకొనడంతో మందున్నలారీ కాలువలోకి దూసుకపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు.

వైరా ఆయకట్టుకు నీటి విడుదల లేనట్లేనా?

» జూలై రెండోవారంలో నీరు విడుదల..?

వైరా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆయకట్టులో వరిసాగుకు జూన్‌లో నీరు విడుదల కనుచూపుమేరలో కన్పించడం లేదు. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఈనెలలో నీరు విడుదల లేనట్లేనని స్పష్టమవుతోంది. అన్నీ అనుకూలిస్తే జూలై రెండోవారంలో నీరు విడుదల చేసే అవకాశముంది. జూలై 10వతేదీ తర్వాత నీరు విడుదలకు అధికారులు ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా ప్రస్తుతం 15.1అడుగులుగా ఉంది. వైరా రిజర్వాయర్ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ఈ జూన్‌లోనే వైరా ఆయకట్టుకు నీరు విడుదల చేసి జూలైలో వరినాట్లు పూర్తయ్యేలా చూస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రతి వేదిక నుంచి ప్రకటించారు. అయితే వాస్తవ పరిస్థితులు అందుకు అనుకూలించడం లేదు.

వెలవెలబోతున్న గోదావరి-నిండని ఎన్నెస్పీ

గోదావరి జలాలను సీతారామ ప్రాజెక్టు నుంచి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా జూన్‌లోనే వైరా రిజర్వాయర్‌ను నింపి ఆయకట్టుకు ముందుగానే నీరు విడుదల చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. అయితే గోదావరిలో ఎక్కడా నీటి లభ్యత లేదు. అందువల్ల గోదావరి జలాలు ఇప్పట్లో వైరా రిజర్వాయర్‌కు దరిచేరే పరిస్థితి కన్పించడం లేదు. గోదావరి నీళ్ల లేక వెలవెలబోతుంది. ఒకవేళ గోదావరిలో నీటి లభ్యత ఉన్నప్పటికీ రాజీవ్



వైరా రిజర్వాయర్

లింక్ కెనాల్ ద్వారా ఎన్నెస్పీ 21మెయిన్ బ్రాంచ్ కెనాల్ నుంచి 14కిలోమీటర్లు ఆ నీటిని వెనక్కు నడిపించే భగీరథ ప్రయత్నం ఎంతవరకు సఫలీకృతమవుతుందో కూడా తెలియని పరిస్థితి. ఇంతవరకు గోదావరి జలాలను వైరాకు తీసుకువచ్చే ట్రయల్ రన్ చేపట్టలేదు. ట్రయల్ రన్ చేసి గోదావరి జలాలను వైరాకు తీసుకు వచ్చినప్పుడు మాత్రమే ఆయకట్టుకు నీరు విడుదల జూన్ నెలలో సాధ్యమయ్యేది. ఇప్పుడు గోదావరిలో నీటి లభ్యత లేనందున ప్రస్తుతం ఆ జలాల ఆలోచన రైతుల్లో లేదు. ఇకపోతే కృష్ణా పరివాహక ప్రాంతంలో కొన్ని ప్రాజెక్టులకు నీరు వచ్చి చేరుతున్నప్పటికీ ఇంకా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరదనీరు తాకలేదు. అందువలన ఇప్పట్లో ఎన్నెస్పీ జలాల విడుదల కన్పించడం లేదు. వైరా రిజర్వాయర్‌లో ఉన్న నీటిని వరినార్లకు విడుదల చేస్తే తర్వాత వర్షాభావం తలెత్తితే ఇబ్బందికర పరిణామాలు ఉంటాయని అధికారులు నిమాంసలో ఉన్నారు.

కొనసాగుతున్న ఆధునీకరణ పనులు...

ఇదిలా ఉంటే వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ విజ్ఞప్తి మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల్లో రెండోదశ ఆధునీకరణ పనులకు రూ.42.10కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఏప్రిల్ 25నుంచి ఆధునీకరణ పనులు మొదలై ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది కుడికాల్వలో 6.2కిలోమీటర్ల సిమెంట్ గైడ్‌వాల్స్ పనులు జరుగుతున్నాయి. ఎడమకాల్వలో లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణ పనులు చేస్తున్నారు. ఇవి పూర్తికావడానికి కనీసం మరో పదిరోజులకుపైగా సమయం పడుతుంది. ఈ రీత్యా కూడా ఈనెలలో నీటి విడుదల గగనకుశంగానే ఉంది. ఈనెల ముగియటానికి ఇంకా కేవలం ఒక్కరోజు మాత్రమే వ్యవధి ఉంది. ఈ పరిస్థితుల్లో జూలై రెండో వారంలో నీటి విడుదలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



కుడికాల్వలో నిర్మించిన సిమెంట్ గైడ్‌వాల్స్



బాధితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న అంబేద్కర్ ఫౌండేషన్ సభ్యులు

ఆనారోగ్య బాధితుడికి అంబేద్కర్ ఫౌండేషన్ ఆర్థిక చేయూత

కల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని అంబేద్కర్ నగర్ కాలనీలో ఆనారోగ్యంతో నిస్సహాయ స్థితిలో ఉన్న బాధితుడికి స్థానిక అంబేద్కర్ ఫౌండేషన్ తరుపున శుక్రవారం ఆర్థిక చేయూత నిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న సైకిల్ షాపు మెకానిక్ రాము ఇటీవల తీవ్రమైన ఆనారోగ్యంతో పని చేసుకోలేని స్థితి ఉన్నాడు. కుటుంబం పూట గడవటం కష్టంగా మారింది. ఈ కుటుంబ పరిస్థితిపై స్పందించిన అంబేద్కర్ ఫౌండేషన్ వారు తమ వంతుగా ముందుకు వచ్చి దాతల నుంచి సేకరించిన రూ.22,700 నగదును రాము కుటుంబ సభ్యులకు అందించారు. కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆర్థిక సహాయం అందించిన దాతలకు, అంబేద్కర్ ఫౌండేషన్ వారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఫౌండేషన్ సభుయలు బీరవల్లి శ్రీను, ఉబ్బన నాగరాజు, మేకల కృష్ణ, దామాల రాజు, బైర్ల కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరికాయలపాడులో తాగునీటి ఎద్దడి



చేతిపంపు వద్ద ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ఏన్కూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆరికాయలపాడు బీసీ కాలనీలో కొన్ని నెలల నుంచి చేతిపంపులు పనిచేయక మంచినీటికి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు ఉన్న 3 చేతిపంపులు పనిచేయడంలేదని మిషన్‌భగీరథ నీరు కూడా సక్రమంగా రావడంలేదని కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దూరప్రాంతాలనుంచి ఇబ్బంది పడుతూ పొలాల్లోని మోటార్ల దగ్గర నుంచి నీరు మోసుకుని రావల్సి వస్తోందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చేతిపంపులను రిపేర్లు చేయాలని కోరుతున్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో సంఘం సమావేశం



సంఘం జిల్లా అధ్యక్షుడు సీతచంద్రరావును సన్మానిస్తున్న సభ్యులు

వైరా 29 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్యవైశ్య కళ్యాణమండపంలో మిట్టపల్లి కిరన్‌కుమార్ సభాఅధ్యక్షతన నూతనంగా ఎన్నికైనటువంటి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి సీతాచంద్రరావును ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర నాయకులు వైరా సంఘం అధ్యక్షులు వనమా విశ్వరరావు పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహాసభ మహిళ అధ్యక్షురాలు దోసపాటి సంధ్యారాణి, జిల్లా సంఘం మహాసభ ప్రధమ ఉపాధ్యాక్షులు నూకల శ్రీనివాస్‌రావుకు సన్మానం చేశారు.

ప్రజల ఆరోగ్యం కోసమే హెల్త్‌క్యాంపులు

» సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత హెల్త్‌క్యాంపులతో ప్రతిఒక్కరికీ ఉపయోగమని సత్తుపల్లి ఎమ్మెల్యే ఎమ్మెల్యే డా.రాగమయి అన్నారు. స్థానిక మసీద్ రోడ్‌లోని జామే మసీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్‌క్యాంప్‌ను ఆమె ప్రారంభించారు. డాక్టర్స్ డే సందర్భంగా రోగులను డా.జీ.అశోక్‌కుమార్, డా.షేక్.మౌలాలీ, డా.వనమా లక్ష్మణ్‌సాయిలు పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం ఐఎంఏ, సత్తుపల్లి డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఉచిత మెగా హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్‌లో పాల్గొని స్వయంగా రోగులను ఎమ్మెల్యే పరీక్షించారు. సుమారు 300మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.టీ.సీతారామ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు డాక్టర్ మట్టా దయానంద్, డా.కె.శివాజీ, జామే మసీద్ సదర్ ఎస్‌కే.నాయబ్ రసూల్, ఎండీ.కమల్‌పాషా, గాదె చెన్నారావు, గ్రాండ్ మౌలాలీ, రాంబాబు పాల్గొన్నారు.



జేవీఆర్ కళాశాలలో రోగులను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే

మైనారిటీ గురుకులం సందర్శన

అనంతరం పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలపై డాక్టర్ మట్టా రాగమయి ఆరాతీశారు. తరగతి గదులు, వసతిసౌకర్యాలతో పాటు స్టాక్ రూమ్‌ను పరిశీలించి ప్రిన్సిపాల్ వెంకట్రామయ్యకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి ఎమ్మెల్యే భోజనం చేశారు.

సేవా కార్యక్రమాలతో బాలికకు నివాళి



మొక్కలు నాటుతున్న ప్రముఖులు

తల్లాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామానుజవరం గ్రామంలో రెండురోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన అయిలూరి పూజిత పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు, ఉపాధ్యాయులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక శుక్రవారం రాత్రి పరుగుమందు తాగి పూజిత ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం పూజిత పుట్టినరోజు కావడంతో ముందుగా పూజిత చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పూజిత జ్ఞాపకార్థం మొక్కలు నాటారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, పెన్నులు అందించారు. మాజీసర్పంచ్ శీలం శివపార్వతి, శీలం శ్రీనివాసరెడ్డి, శీలం నాగిరెడ్డి పాల్గొన్నారు.

మధిరలో డ్రెయినేజీ వ్యవస్థపై అవగాహన

మధిరరూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మధిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థపై అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. మధిర మునిసిపాలిటీ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వై.నరేష్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్టు అవసరం, ఉపయోగాలు, ప్రజారోగ్యంపై ప్రభావం గురించి ఈ సందర్భంగా వివరించారు. ఈ ప్రాజెక్టు అనుసంధానం పైపుల నుంచి ట్రంక్ మెయిన్స్ వరకు అక్కడినుంచి మురుగుశుద్ధి కేంద్రం వరకు ఎలా పనిచేస్తుందో తెలిపారు. ఇంటి నుంచి బయలుదేరే మురుగు నీరు పైపులైన్ నెట్‌వర్క్ ద్వారా ఎలా సేకరించబడుతుందో, మ్యాన్‌హోల్స్ ఉపయోగం వంటి వాటి గురించి వివరించారు. ప్రజలసందేహాలకు సాంకేతిక వివరాలతో సమాధానమిచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మార్కెట్ కమిటీచైర్మన్ బండారు నరసింహారావు పాల్గొన్నారు.



ప్రజెంటేషన్‌లో పాల్గొన్న మల్లునందిని, రాజకీయపక్షాల నాయకులు

స్పోర్ట్స్ స్కూల్‌కు నేత్రిక ఎంపిక



బాలికలను సన్మానిస్తున్న ప్రవీణ్‌కుమార్

ఏన్కూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం నిర్వహించిన టెస్ట్‌లో ఏన్కూరు మండలం, తిమ్మరావుపేట ఓం ఆధిత్యగాయత్రి స్కూల్‌లో శిక్షణ పొందిన గిరిజన విద్యార్థిని అజ్మీర నేత్రిక జిల్లా స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. ఈ సందర్భంగా నేత్రికను పాల్వంచ పట్టణంలోని స్వేరోస్ బూట్ క్యాంపు శిక్షణలో ఆదివారం గురుకుల మాజీ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను విజ్ఞానవంతులను చేస్తున్న ప్రిన్సిపాల్ దాసరి రమేష్, ఉపాధ్యాయులను అభినందించారు.



కమ్మజనసేవా సమితి నూతన కార్యవర్గంలో కొండబాల, దుర్గాప్రసాద్

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

వైరా, 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రంలో కమ్మ జనసేవా సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య సమన్వయ కర్తలుగా మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కమ్మ జనసేవా సమితి ఫౌండర్ అడపా అప్పారావు ప్రముఖ వ్యాయవాధి కాటంనేని రమేష్, మండడపు మధుసూధన్ రావు సమన్వయంతో నూతన కమిటిని ఎన్నుకున్నారు .ఈ సందర్భంగా కమ్మ సేవా సమితి కళ్యాణ మండపం అధ్యక్షులుగా కట్టా కృష్ణారునరావు, ఉపాధ్యక్షలుగా మేదర్లమెట్ల శ్రీనివాస్‌రావు ప్రధాన కార్యదర్శిగా చింతనిప్పు రాంబాబు, జాయింట్ సెక్రటరీగా సూర్యదేవర శ్రీధర్, కోశాధికారిగా ఏనుగు హనుమంతరావులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మరి కొంతమందిని ఎన్నుకున్నారు. గౌరవ సలహా మండలి అధ్యక్షులుగా శ్రీరామనేని రామస్వామి, చింతనిప్పు వెంకటయ్య, దామా బీరయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొండబాల మాట్లాడుతూ.. సమితి అభివృద్ధికి ప్రతిఒక్కరు కృషిచేయాలని కోరారు.

రాజ్యాంగాన్ని దెబ్బతీసేలా కేంద్రం కుట్రలు

» సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు

సత్తుపల్లిరూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాధులు ఈ దేశ రాజ్యాంగాన్ని దెబ్బతీసేలా కుట్రలు సాగిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు అన్నారు. సీపీఐ పట్టణ 5వ మహాసభ స్థానిక తాపీ వర్కర్స్ భవనంలో నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యానికి ముందే పుట్టి దేశంలో సంపూర్ణ స్వాతంత్రం కావాలని నినదించి నాటినుంచి నేటివరకు పీడిత ప్రజల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) అన్నారు. సమాజాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల మధ్య కులమతాల చిచ్చుపెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఖూనీ చేస్తోందని, హక్కుల కోసం అడిగినవారిని జైళ్లల్లో వేస్తూ రాజ్యాంగానికి విఘాతం కలిగించే పద్ధతుల్లో అప్రకటిత ఎమర్జెన్సీని నడిపిస్తోందని విమర్శించారు. 44కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు పాల్పడుతున్న కేంద్రాన్ని గద్దెదించాలని, ఈ క్రమంలో జూలై 9న జరిగే దేశావ్యాప్త సమ్మెలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, దండు ఆదినారాయణ, తడికమళ్ల యోబు, సముద్రాల సుధాకర్, ఎస్‌కే.రంజాన్, రామలక్ష్మీ, కాగిత వెంకటేశ్వర్లు, పాలకుర్తి వీరయ్య, పిల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల సందర్భంగా జెండావిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శాకంబరీగా అమ్మవారు దర్శనం



కూరగాయలతో అమ్మవారు అలంకరణం

తల్లాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని కోటమైసమ్మ అమ్మవారు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాడ మాసం నాలగవరోజు ఆదివారం కోటమైసమ్మ దేవాలయంలో అర్చకుడు కంచల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని కూరగాయలతో శాకంబరీగా అలకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే ఆలయానికి క్యూ కట్టారు.

ఆశాజనకంగా ముదురు పత్తిచేలు



ఏపుగా పెరుగుతున్న మొక్కలు

ఏన్కూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ముందస్తుగా వేసినపత్తి చేలు ఆశానజకంగా ఉన్నాయి. ఏపుగా పెరగడంతో ఎరువులు, కలుపులు, పాట్లు చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఆలస్యంగా వేసిన చేలు మాత్రం ఎదుగుబొదుగు లేకుండా గిడసబారిపోతున్నాయి. గత రెండేళ్ల నుంచి మిర్చిసాగు చేసిన రైతులు వైరస్‌కారణంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది మండలంలోని రైతులు పత్తిసాగు వైపు మొగ్గు చూపారు. ఏన్కూరు, నాచారం, రేపల్లెవాడ, మేడేపల్లి, రాజులపాలెం, భద్రతండా, టీఎల్‌పెట, జన్నారం, బురదరాఘవాపురం, లచ్చగూడం, శ్రీరామగిరి, రాజలింగాల, సూర్యతండా, ఎర్రుడుతండా గ్రామాల్లో ఎక్కువగా పత్తిసాగు చేశారు. సుమారు 1200 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా. పత్తిసాగుతోపాటు మొక్కజొన్న కూడా సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఏవో నరసింహారావు, ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు ఇస్తున్నారు.

యూరియా విక్రయాలను నిలిపివేస్తున్నాం

చింతకాని, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డీలర్లకు భారమవుతున్న డీఏపీ, యూరియా విక్రయాలను నిలిపివేస్తున్నట్లు చింతకాని మండల ఎరువుల డీలర్స్ అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివారం మండల కేంద్రంలో మండల ప్రైవేట్ ఎరువుల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లకు, రైతులకు భారమవుతున్న డీఏపీ, యూరియా లాంటి ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎరువుల కంపెనీలు ఇష్టానుసారం లింకులు పెట్టి ఎరువులను సరఫరా చేస్తున్నాయని ఇది తమకు భారమవుతున్నట్లు తెలిపారు. అనంతరం మండల కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎరువుల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకోదండరామ ఫెర్టిలైజర్ చింతకాని ప్రొప్రైటర్ పుప్పుగండ్ల రవి, ఉపాధ్యక్షుడిగా గోపాల్‌కృష్ణ ఫెర్టిలైజర్స్ లచ్చగూడెం ప్రొప్రైటర్ మందా గోపాల్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిపక్షాన్ని టార్గెట్ చేస్తున్న ప్రభుత్వం

» బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్‌రాజు

బోనకల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిథులు కావాలనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వ్యక్తిగతంగా మీడియా ముసుగులో టార్గెట్ చేస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి లింగాల కమల్ రాజు ఆరోపించారు. మండలంలోని రావినూతల గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారాలకు దిగుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అరాచక రాజకీయాలకు తెరతీస్తున్నాడని విమర్శించారు. మధిర నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన కొందరి ఆగడాలు శృతిమించుతున్నాయని వాపోయారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేబ్రోలు మల్లికార్జున్, బంధం శ్రీనివాసరావు, వేమూరి ప్రసాద్, భానోత్ కొండ, తారా ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజు

బీసీ రేజర్వేషన్లపై నోరు విప్పని రాజకీయ పార్టీలు

కల్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీల జపం చేసిన రాజకీయ పార్టీలు ఇప్పుడు 42 శాతం రిజర్వేషన్లపై ఎందుకు నోరువిప్పటం లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం కల్లూరులో ఏర్పాటైన బీసీ సంఘం మండల ముఖ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీల జపం చేశాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఆందోళన కార్యక్రమాలు సాగుతుండగా ఒక్క కాంగ్రెస్ పార్టీ మినహా ఇతర రాజకీయ పార్టీలు ఏమాత్రం స్పందిచక పోవటం శోచనీయం మన్నారు. బీసీల రిజర్వేషన్ల అమలు విషయంలో కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ పార్లమెంట్‌లో బిల్లు తీసుకో వచ్చేందుకు చొరవ చూపాలని శ్రీనివాస్ కోరారు. బీసీల విషయంలో బిజెపి, బిఆర్ఎస్‌లు మేక తోలు కప్పుకున్న తోడేలులాగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జూలై 20 తేది నాటికి అన్ని గ్రామాల్లో బీసీల కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా బీసీల సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ లింగబోయిన పుల్లారావు మాట్లాడుతూ సంఘ నిర్మాణం, భవిషత్తు కార్యచరణపై వివరించారు.ఈ సమావేశంలో కల్లూరు పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు బయ్యారపు నరేందర్, ఆళ్లకుంట నరిసింహారావు, బోడ్డు కృష్ణ, ఎనుముల రాము, వెంకటాచారి, రామనరిసింహారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

WANTED

18k సంప్ర. 9848999184 / 9640648899

AJH-15092

ఉద్యోగావకాశాలు

NK అగ్రో ఎక్స్‌పోర్ట్స్ Pvt.Ltd

9949976505

మెయిల్ : hr@nkexpo.com

AJG-238772

పాఠకులకు ముఖ్య గమనిక

మేనేజర్ - ఏడివిటి

పుట్టిన రోజు

పదవీవిరమణ

4 Lines Classifieds 220/- Only

ఖమ్మం : 9985401672

9985406151
9985401698

కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347